RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 306 మేడ్చల్ మల్కాజ్‌గిరి 27 నవంబర్ 2024 బుధవారం పేజీలు : 4

## అండమాన్ దగ్గర 6 టన్నుల డ్రగ్స్

పోర్టుబ్లెయిర్ : భారత తీర గస్తీ దళం అండమాన్ దీవుల దగ్గర భారీ ఎత్తున మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకుందని అధికారులు వెల్లడించారు. ఆరు టన్నుల(6వేల కిలోల) ఈ మాదక ద్రవ్యాల(కాంట్రాబాండ్ మెథంఫెటమైన్) విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.25000 కోట్లు ఉ ంటుందని అంచనా. వీటిని ఒక్కోటి రెండేసి కేజీల చొప్పున 3000 ప్యాకెట్లుగా తయారుచేసి తరలిస్తున్నారు. ఈ నెల 23న అండమాన్ దీవుల వద్ద పహారా కాస్తున్న తీర గస్తీ దళం విమానం (డార్నియర్) పైలెట్ బ్యారెన్ దీవి దగ్గర అనుమానాస్పదంగా సంచరిస్తున్న చేపల వేట ట్రాలర్‌ని గుర్తించారు. అందులో ఉన్న ఆరుగురు మయన్మార్ జాతీయులను అరెస్టు చేశారు. ట్రాలర్‌లో ఉన్న మాదక ద్రవ్యాలను భారత్, దాని పొరుగు దేశాలకు సరఫరా చేసేందుకే తరలిస్తున్నారని భావిస్తున్నారు.

# 'మహా' మంతనాలు..

## 'సీఎం' ఎంపిక మరింత ఆలస్యమేనా?



మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మహాయుతి కూటమి.. ప్రభుత్వ ఏర్పాటుపై మల్లగుల్లాలు పడుతోంది. తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నదానిపై నిర్ణయం మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

కొత్తగా ఏర్పడే ప్రభుత్వంలో శాఖల కేటాయింపు, కీలక పదవులు ఖరారయ్యేవరకు సీఎం పేరును ప్రకటించకూడదని భాజపా యోచిస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఏక్‌నాథ్ శిందే రాజీనామా చేసిన తర్వాత.. ఆపద్ధర్మ సీఎంగా కొనసాగాలని గవర్నర్ సూచించడం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది. ముఖ్యమంత్రి పేరును ప్రకటించడంలో కేంద్ర నాయకత్వం తొందరపడటం లేదని మహారాష్ట్రకు చెందిన ఓ భాజపా సీనియర్ నేత తెలిపారు. మంత్రిత్వ శాఖలు, జిల్లాల ఇన్‌ఛార్జులు వంటి కీలక పదవుల ఖరారు, ప్రభుత్వ



ఏర్పాటుకు సమగ్ర ప్రణాళిక రూపొందించడమే తమ ప్రాధాన్య మన్నారు. భాగస్వామ్య పక్షాల్లో ఎటువంటి భేదాభిప్రాయాలు రాకుండా ఉండేందుకు అధిష్ఠానం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని.. పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో ఆ వ్యవహారాలతోపాటు మహారాష్ట్ర నేతలతోనూ సుదీర్ఘ మంతనాలు జరుపుతోందని చెప్పారు.

**త్వరలో క్లారిటీ..** మహారాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధత కొనసాగుతుండటంపై శివసేన అధికార ప్రతినిధి సంజయ్ శిర్సాట్ స్పందించారు. మంగళవారం రాత్రి లేదా బుధవారం ఉదయం వరకు దీనిపై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. శిందే, ఫడణవీస్, అజిత్ పవార్‌లు మంగళవారం సాయంత్రం భేటీ అవుతారని, ఆ తర్వాత ఓ నిర్ణయం వెలువడుతుందన్నారు. మరోవైపు, మహారాష్ట్ర పరిణామాలను పర్యవేక్షించేందుకు పరిశీలకుడు లేదా బృందాన్ని భాజపా నాయకత్వం ముంబయికి పంపించనున్నట్లు తెలుస్తోంది. కేబినెట్ కూర్పుపై ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో చర్చించిన తర్వాతే సీఎం పదవిపై ఓ ప్రకటన చేయనున్నట్లు సమాచారం.

మహారాష్ట్రలో ప్రస్తుత ప్రభుత్వ గడువు నేటితో (నవంబర్ 26)తో ముగుస్తుంది. ఈ క్రమంలోనే ఏక్‌నాథ్ శిందే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. కొత్త సీఎం ప్రమాణం చేసేంతవరకు ఆపద్ధర్మ సీఎంగా కొనసాగాలని శిందేకు గవర్నర్ సూచించారు.

## మేం రెడ్ సిగ్నల్ ఇస్తే.. మీరు రెడ్ కార్పెట్ వేస్తున్నారు: కేటీఆర్

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిలో నిస్పృహ, అసహనం కనిపిస్తున్నాయని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. భారాస హయాంలో అదానీకి ఇచ్చిన పనులు అంటూ ఆయన ఓ తప్పుడు నివేదిక విడుదల చేశారని ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. సీఎం



సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. "సీఎం అవగాహనా రాహిత్యంతో మాట్లాడితే ఎలా?అదానీ కలిసి కొన్ని ప్రతిపాదనలు ఇస్తే అప్పటి సీఎం కేసీఆర్ తిరస్కరించారు. అదానీకి.. మేము రెడ్ సిగ్నల్ వేస్తే.. మీరు రెడ్ కార్పెట్ వేస్తున్నారు" అని సీఎం రేవంత్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.





## వరంగల్‌తో పాటు మరో 3 విమానాశ్రయాలు ఏర్పాటు చేయండి: సీఎం రేవంత్‌రెడ్డి

దిల్లీ: దిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశమయ్యారు. ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు ఉన్నారు. రాష్ట్రంలో విమానాశ్రయాల ఏర్పాటుకు అనుకూలమైన ప్రాంతాల గురించి కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా వరంగల్ ఎయిర్ పోర్టు పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. భూ సేకరణ ఎంత తొందరగా పూర్తయితే.. అంత త్వరగా ఎయిర్ పోర్టు నిర్మాణ పనులు చేపడతామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, ఆదిలాబాద్ ప్రాంతాల్లో ఎయిర్ పోర్టు నిర్మాణాలు చేపట్టాలని సీఎం ప్రతిపాదించారు. ఆయా ప్రాంతాల్లో ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.


## ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమే..

### విద్యార్థిని ప్రాణం తీసిన పాపం ఊరికే పోదు

హైదరాబాద్: ఫుడ్ పాయిజన్‌తో చనిపోయిన వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవా లక్ష్మిని పోలీసులు అడ్డుకోవడంపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిడ్డను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ తల్లిదండ్రులకు భరోసా ఇచ్చేందుకు వారి గ్రామానికి వెళ్తున్న ఎమ్మెల్యేతోపాటు ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. తల్లిదండ్రుల ఆవేదనను ప్రపంచానికి చూపేందుకు వెళ్తున్న మీడియాను సైతం



గ్రామానికి పది కిలోమీటర్ల దూరంలో బ్యారికెడ్లు వేసి అడ్డుకోవడం అప్రజాస్వామికమని, మీడియా స్వేచ్ఛను హరించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాంకిడి గురుకుల విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమేనని చెప్పారు. ప్రభుత్వం తమ తప్పేం లేదన్నట్లు వ్యవహరించినంత మాత్రాన విద్యార్థిని ప్రాణం తీసిన పాపం ఊరికే పోదన్నారు. జాతీయ రాజ్యాంగ దినోత్సవం అంటూ దేశ వ్యాప్తంగా గొప్పగా జరుపుకుంటున్నాం కానీ, ఆ రాజ్యాంగ సూత్రాలను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా తుంగలో తొక్కుతున్నదని మండిపడ్డారు. ప్రశ్నిస్తే కేసులు, గొంతెత్తితే దాడులు, ప్రజా ప్రతినిధుల హౌజ్ అరెస్టులు, మీడియాపై కఠిన ఆంక్షలని విమర్శించారు. ఇదేమి రాజ్యం రేవంత్ రెడ్డి అంటూ ఎక్స్ వేదికగా నిలదీశారు.




# ఊహల పల్లకీలో ఆశావహులు!

## 2025 మార్చి నాటికి 9 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ

### ఇందులో గ్రాడ్యుయేట్, టీచర్స్, ఎమ్మెల్యే కోటా.. - భారీ ఆశలు పెట్టుకుంటున్న కాంగ్రెస్ నేతలు

### సభ్యత్వం కోసం వివిధస్థాయి లీడర్ల ప్రయత్నాలు - యువ నేతలకు చాన్స్? ఇచ్చే యోచనలో అధిష్టానం

### మండలిలో ఇప్పటివరకూ బీఆర్ఎస్‌దే మెజార్టీ - ఖాళీ స్థానాలను ఖాతాలో వేసుకోవడంపై కాంగ్రెస్ ఫోకస్

హైదరాబాద్ : వచ్చే ఏడాది మార్చి నాటికి శాసన మండలిలో 9 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. ఈ ఎమ్మెల్సీల జాబితాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి మూడేసి చొప్పున ఉండగా.. మజ్లిస్ నుంచి ఒకరు, ఇండిపెండెంట్ సభ్యులు ఇద్దరు ఉన్నారు. వీరిలో బీఆర్ఎస్ నుంచి శేరి సుభాశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, కాంగ్రెస్ తరఫున జీవన్ రెడ్డి, ఎగ్గె మల్లేశం, ఎంఎస్ ప్రభాకర్, మజ్లిస్ నుంచి మీర్జా రియాజ్ ఉల్ హసన్, ఇండిపెండెంట్లుగా అలుగుబెల్లి నర్సిరెడ్డి, కూర రఘోత్తం రెడ్డి ఉన్నారు. ఈ 9 మంది పదవీకాలం మరో 4 నెలలు మాత్రమే ఉండడంతో కాంగ్రెస్ లోని చాలా మంది ఆశావహులు ఖాళీ అవుతున్న ఎమ్మెల్సీ సీట్లపై ఆశలు పెట్టుకుంటున్నారు. ఇందులో గ్రాడ్యుయేట్, టీచర్స్, ఎమ్మెల్యే కోటా నుంచి ఎన్నికైన ఎమ్మెల్సీలు ఉండగా, సభ్యత్వం కోసం వివిధ స్థాయి నేతలు ఇప్పటినుంచే ప్రయత్నాలు చేస్తున్నారు. శాసన మండలిలో ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి జీవన్ రెడ్డి, బల్మూరి వెంకట్, తీన్మార్ మల్లన్న, మహేశ్ కుమార్ గౌడ్, ఆమెర్ అలీఖాన్, కోదండరామ్ ఎమ్మెల్సీలుగా ఉన్నారు. గత మూడు నెలల కిందట బీఆర్ఎస్ కు చెందిన ఎమ్మెల్సీలు భానుప్రసాద్, సారయ్య, దండె విఠల్, ఎంఎస్ ప్రభాకర్, ఎగ్గె మల్లేశం, బుగ్గారపు దయానంద్.. సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. దీంతో ప్రస్తుతం మండలిలో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 12 కు చేరింది. వీరితో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలుగా ఉన్న పట్నం మహేందర్ రెడ్డి, గుత్తా సుఖేందర్ రెడ్డి, కూచుకుళ్ల దామోదర్ రెడ్డి ప్రస్తుతం ఆ పార్టీకి దూరంగా ఉంటూ మండలిలో కాంగ్రెస్ కు మద్దతుదారులుగా ఉన్నారు. ఈ లెక్కన శాసన మండలిలో కాంగ్రెస్ తన బలాన్ని 15 కు పెంచుకోగలిగింది.

**యువ నేతలకు ప్రాధాన్యం!...** యువ నేతలకు కాంగ్రెస్ హైకమాండ్ కీలక పదవులు కట్టబెడుతూ, వారికి పార్టీపరంగా పెద్దపీట వేస్తున్నది. దీంతో రాష్ట్రంలోని యువ నేతలు మండలిలో అడుగుపెట్టేందుకు ఇప్పటి నుంచే తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. రాజ్యసభ సభ్యుడిగా రాష్ట్రం నుంచి ఎన్ఎస్ యూఐ నేత అనిల్ కుమార్ యాదవ్ కు హైకమాండ్ అవకాశం ఇవ్వగా, మరో ఎన్ఎస్ యూ ఐ నేత బల్మూరి వెంకట్ కు ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టింది. ఇద్దరు యువ నేతలకు పార్టీలో ఇంతటి ప్రాధాన్యత దక్కడంతో, ఇప్పుడు ఖాళీ అవుతున్న ఎమ్మెల్సీ స్థానాల్లో కూడా రాష్ట్రం నుంచి ఇంకొంతమంది యువ నేతలకు ప్రాధాన్యత ఉండనుందనే చర్చ కాంగ్రెస్ లో సాగుతున్నది. ఇందులో సామాజిక సమీకరణలు, యువత, మహిళలు, పార్టీ విధేయులు, సీనియర్లు, పీసీసీలో కీలక పదవి ఆశించి భంగపడ్డ నేతలు, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్లను త్యాగం చేసిన వారు..ఇలా వివిధ వర్గాల నుంచి ఈ పదవులకు పేర్లను పరిశీలిస్తారని పీసీసీ నేతలు చెప్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్?గౌడ్ అభిప్రాయాలకు తోడు పార్టీ బలోపేతానికి ఎవరిని మండలికి పంపించాలనే విషయంలో మాత్రం చివరకు హైకమాండ్ నిర్ణయమే ఫైనల్ కానుందని పీసీసీ వర్గాలు అంటున్నాయి.

**మరింత పట్టు సాధించేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు...** శాసన మండలిలో మొత్తం 40 మంది సభ్యులు ఉండగా, ప్రస్తుతానికి బీఆర్ఎస్ పార్టీ సభ్యులే మెజార్టీలో ఉన్నారు. దీంతో మండలిలో ప్రభుత్వం ఏ బిల్లు ప్రవేశపెట్టినా.. అది ఆమోదం పొందడం ఇప్పుడు కాంగ్రెస్ కు కొంత ఇబ్బందికర పరిస్థితే ఉన్నది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఖాళీ అవుతున్న ఈ 9 స్థానాలను ఎట్టి పరిస్థితుల్లో తన ఖాతాలో వేసుకునేలా సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ నాయకత్వం ఇప్పటి నుంచే దీనిపై దృష్టి పెట్టింది. కాంగ్రెస్ కు బలమైన గొంతుకలను పంపించి, అసెంబ్లీలో పైచేయిగా ఉన్నట్టే మండలిలో కూడా తమ పట్టు పెంచుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది.

# సంపాదకీయం

## ఇప్పటికి వెంటాడుతున్న భోపాల్ ట్రాజెడీ..

## తేలని ప్రశ్నలు ఎన్నో..

40 ఏళ్ల క్రితం మధ్యప్రదేశ్లో జరిగిన భోపాల్ గ్యాస్ ట్రాజెడీ గురించి తెలియని వ్యక్తులు ఉండరు. అయితే దీనికి సంబంధించి ఓ భయానక విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. మధ్యప్రదేశ్లోని యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ నుంచి వెలువడిన విషవాయువుల కారణంగా అప్పుడు బలైన వారే కాకుండా అనంతరం ఆ ప్రాంతంలో కొన్ని తరాలపాటు విషవాయువుల ప్రభావాన్ని గమనించినట్టు స్థానిక వైద్య నిపుణులు పేర్కొన్నారు. 1984 డిసెంబర్ 2 అర్ధరాత్రి సమయంలో భోపాల్లోని యూనియన్ కార్బైడ్ కర్మాగారం నుండి వెలువడిన విష వాయువుల కారణంగా 3787 మంది ప్రాణాలు కోల్పోయారు. అంతేకాదు ఈ సంఘటనలో సుమారు ఐదు లక్షల మంది ప్రభావితులయ్యారు. ఇప్పటికీ ఈ ఇన్సిడెంట్ కు సంబంధించిన బాధితులు న్యాయం కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు. ఇక ప్రమాదం జరిగిన రోజు విషయానికి వస్తే.. భోపాల్ లోని మెడికల్ కాలేజీలో ఫోరంసెట్ డిపార్ట్మెంట్కు చెందిన డాక్టర్ డీకే సత్పతి.. ఆరోజు దుర్ఘటనలో చనిపోయిన 875 మంది శవాలకు పరీక్షలు నిర్వహించారు. అంతేకాదు ఆ తర్వాత ఐదు సంవత్సరాల పాటు సుమారు 18 వేలమంది బాధితుల శవపరీక్షలకు సాక్షిగా నిలిచారు. ఈ పూర్తి కాలంలో ఆయనకు ఈ ఇన్సిడెంట్ కు సంబంధించి ఎన్నో ప్రశ్నలు మిగిలిపోయాయి. ఈ నేపథ్యంలో భోపాల్ దుర్ఘటన బాధితుల సంఘం నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రమాదానికి సంబంధించి కొన్ని విషయాలను పంచుకున్నారు. ఈ ప్రమాదం నుంచి బయట పడిన మహిళలకు పుట్టబోయే పిల్లలపై ప్రభావం ఉన్నట్లు ఆయన లేవనెత్తిన ప్రశ్నలను యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ ఖండించిందని.. అటువంటి ప్రభావాలు ఏమీ ఉండవని పేర్కొందని ఆయన తెలిపారు. అయితే అప్పుడు ప్రమాదంలో మరణించిన గర్భిణీల రక్త నమూనాలను పరీక్షించిన సమయంలో.. తల్లిలో ఉన్న విష పదార్థాలలో 50% గర్భంలో ఉన్న శిశువులో కూడా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే వీటిపై జరిపిన పరిశోధనలను ఎందుకు నిలిపివేశారు అంటూ ప్రశ్నించారు. అంతేకాదు ఈ ఫ్యాక్టరీ నుంచి విడుదలైనటువంటి మిథైల్ ఐసోసైనేట్ గ్యాస్ నీటిలో కలవడం వల్ల క్యాన్సర్ లాంటి భయానక వ్యాధులకు కారణమయ్యే విషవాయువులు ఏర్పడ్డాయని అన్నారు. ఇప్పటివరకు భోపాల్ దుర్ఘటన గురించి ఒక్క యాంగిల్ మాత్రమే తెలిసిన చాలామందికి డాక్టర్ డీకే సత్పతి మాటల ద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలిసాయి.

# భూమిపూజతోనే సరిపెట్టారు



వేములవాడ: అధికారుల అలసత్వం, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం వెరసి నిధులున్నా వంతెన నిర్మాణం భూమిపూజకే పరిమితమైంది. వేములవాడ పట్టణంలోని మల్లారం రోడ్డులో కట్టుకాలువ వద్ద ఏటా భారీ వర్షాలకు వరద ప్రవాహం కారణంగా ఈ ప్రాంత గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో కాలువపై పైవంతెన నిర్మాణానికి ప్రతిపాదన చేశారు. దాదాపు రూ.2.5 కోట్లు మంజూరు కాగా అప్పటి ఎమ్మెల్యే సీహెచ్.రమేశ్‌బాబు దాదాపు ఏడాదిన్నర క్రితం భూమిపూజ చేశారు. దీంతో వంతెన నిర్మాణం పూర్తయి తమ కష్టాలు తీరుతాయని ఈ ప్రాంత గ్రామాల ప్రజలు ఆశ పడ్డారు. అయితే పనులు మొదలు కాకపోవడంతో ఈ ప్రాంతీయుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతుంది.

**వాగు పారితే రాకపోకలు బంద్**

వేములవాడ పట్టణ శివారు మల్లారం రోడ్డులోని కట్టుకాలువ వర్షాకాలంలో ఉధృతంగా పారితే ఈ ప్రాంతం వైపు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఏటా వర్షాకాలంలో ఇదే తంతు జరుగుతున్నా అధికారులు పనులు మొదలు పెట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

భారీ వర్షం కురిస్తే భీమేశ్వరకాలువ నీటితో పాటు వ్యవసాయ క్షేత్రాల నుంచి నీరు భారీగా ఈ కాలువలో చేరుతుంది. దీంతో ఈ కల్వర్టు వద్ద వరద ప్రవాహం వల్ల రవాణా స్తంభించిపోతుంది.

కల్వర్టు అవతలి వైపు ఉన్న జయవరం, మల్లారం, హన్మాజీపేట, బొల్లారం, లింగంపల్లి, గ్రామాలతో పాటు కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి వైపు వెళ్లే గ్రామాల ప్రజలు, మరోవైపు చందుర్తి మండలంలోని ఎన్గల్, బండపల్లి వైపు వెళ్లే గ్రామాలకు రాకపోకలు నిలిచి పోతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వేములవాడ, సిరిసిల్ల పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఈ మార్గం మీదుగా నిజామాబాద్ జిల్లా సిరికొండ వరకు రవాణా సౌకర్యం నిలిచిపోతుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ వంతెన నిర్మాణం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల ఈ ప్రాంత గ్రామాల ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతుంది.

వర్షాకాలం ఇబ్బందులు పడుతున్నాం

కాలువ పారితే మా గ్రామంతో పాటు ఇటు వైపు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతుంటాయి. దీంతో దాదాపు ఐదారు గ్రామాల ప్రజలు వేములవాడ వెళ్లడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పై వంతెన నిర్మిస్తే ఈ ప్రాంత గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయి.

ఎంద్రాల కిరణ్, జయవరం

పనులు మొదలు పెడతాం

గుత్తేదారు కొన్ని కారణాల వల్ల పై వంతెన నిర్మాణ పనులు ప్రారంభించలేదు. దీంతో జాప్యం నెలకొంది. ముందుగా కల్వర్టు వద్ద డైవర్షన్ రోడ్డు నిర్మించి త్వరలో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం.

శాంతయ్య, డీఈఈ, ఆర్అండ్‌బీ, వేములవాడ

# వైద్య సేవల పరిమితి పెంపుపై విశ్రాంత కార్మికుల్లో ఉత్కంఠ



గోదావరిఖని : సింగరేణి విశ్రాంత కార్మికులకు రూ.8 లక్షల వరకు వైద్య సేవలు పొందే పరిమితి ఉంది. అయితే దీనిని రూ.10 లక్షలకు పెంచుతామని ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించడంతో పెంపుపై ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ఇందులో భాగంగా జేబీసీసీఐ(బొగ్గుగని కార్మికుల సంయుక్త సంప్రదింపుల కమిటీ)తో ఒప్పందం చేసుకున్నారు.

**సవరణకు ఎదురుచూపులు**

ఈనెల 7న సింగరేణి కార్మికులకు లాభాల వాటా పంపిణీ సమయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వైద్య సేవల పథక పరిమితిని పెంచుతామని ప్రకటించారు. భార్యభర్తకి కలిపి రూ.8 లక్షల వరకు మాత్రమే పరిమితి ఉండటంతో తలో రూ.4 లక్షల వరకు మాత్రమే వైద్య సేవలకు వెచ్చిస్తూ.. ఈ మొత్తాన్ని జీవితకాలం వినియోగించుకోవాలి. అయితే పెద్దజబ్బు వస్తే ఒకేసారికి పూర్తిగా అయిపోయే అవకాశముంది. ప్రకటించిన రూ.10 లక్షల పెంపుపై యాజమాన్యం అమలుకు ఆదేశాలు జారీచేస్తే విశ్రాంత ఉద్యోగులకు ప్రయోజనం కలగనుంది.

**విశ్రాంత అధికారులకు రూ.25 లక్షలు**

సింగరేణి అధికారుల వైద్యసేవల పథకం మరింత మెరుగ్గా ఉంది. వారికి రూ.25 లక్షల వరకు వైద్య సేవలు పొందే అవకాశముంది. అయితే వారికి సంబంధించిన పథకం.. ఉద్యోగులకు సంబంధించిన దానిలో తేడాలున్నాయి. కార్మికులు ఉద్యోగ విరమణ పొందే సమయంలో రూ.40 వేలు వైద్య సేవల పథకం కింద చెల్లిస్తే రూ.8 లక్షల పరిమితి వరకు చికిత్స పొందే వీలుంది. అధికారులకు సంబంధించిన పథకంలో ప్రతినెలా వారి జీతభత్యాల్లోంచి 4 శాతం కోసం కోత విధించి నిధికి జమ చేస్తారు.

**36 వేలమందికి ఉపయోగం..**

ఎక్కువమంది విశ్రాంత కార్మికులు ఉండటంతోపాటు వైద్య సేవల నిధికి తక్కువ మొత్తంలో జమ చేస్తుండటంతో పరిమితి తక్కువగా విధించారు. ప్రస్తుతం సింగరేణిలో 36 వేల మంది విశ్రాంత కార్మికులు సీపీఆర్ఎంఎస్(విశ్రాంత ఉద్యోగుల వైద్య సేవల పథకం)లో సభ్యులుగా ఉన్నారు. వీరికి సంస్థ ఆస్పత్రుల్లో సాధారణ చికిత్సలు ఉచితంగా అందిస్తారు.

**ప్రతినెలా ఉచితంగా మందులు**

సీపీఆర్ఎంఎస్‌లోని విశ్రాంత కార్మికులు ఇన్‌పేషంట్‌గా చేరితే 40 శాతం వైద్య సేవల పథకం నుంచి కోత విధిస్తారు. మిగతా 60 శాతం యాజమాన్యం భరిస్తుంది. ప్రతినెలా అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తారు. అలాగే ప్రాణాంతక వ్యాధులకు సంబంధించిన వైద్యానికి అయ్యే ఖర్చులు అపరిమితం. క్యాన్సర్, హృదయ సంబంధిత, మూత్రపిండాలు, ఎయిడ్స్, రహదారి ప్రమాదం, పక్షవాతం, నరాలకు సంబంధించిన వైద్యం అపరిమితంగా పొందే అవకాశం ఉంటుంది.

# పేరుకే పెద్దాసుపత్రి.. వైద్యులేరీ?

హుజూరాబాద: జాతీయ స్థాయిలో హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రి గుర్తింపు పొందింది. నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నారు కానీ.. ఇక్కడ వైద్యుల కొరత ఉండటంతో రోగులు ఇక్కట్లకు గురవుతున్నారు. రోజుకు వందల మంది సేవల కోసం ఆసుపత్రికి వస్తుంటారు. ఉన్న వైద్యులతోనే సేవలను అందిస్తున్నారు.

అరకొర సిబ్బంది.. తప్పని ఇబ్బంది హుజూరాబాద్‌లోని వంద పడకలు గల ఏరియా ఆసుపత్రిలో మొత్తం 14 మంది రెగ్యులర్ వైద్యులున్నారు. మరో 9 మంది వైద్యులు డిప్యుటేషన్‌పై వచ్చారు. మొత్తం 23 మంది వైద్యులు సేవలను అందిస్తున్నారు.

జ్వరాలు, రోడ్డు ప్రమాదాలు, కుక్కకాటు, పాముకాటు, పాయిజన్, చర్మ, కంటి, దంత, చెవి, ముక్కు, గొంతు, సాధారణ వైద్య సేవల కోసం రోజూ సుమారు 400 నుంచి 470 మంది వరకు వస్తున్నారు. మరో 100 మంది వరకు గర్భిణులు వైద్యం పొందుతున్నారు. అందులో 30 మందికి సాధారణ ప్రసవాలు జరుగుతున్నాయి.

ప్రస్తుతం 20 నుంచి 30 వరకు సాధారణ, ఎముకల శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. ఆసుపత్రిలో సూపరింటెండెంట్, ఆర్ఎంవో, ఏవోతోపాటు ఆరుగురు సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, నలుగురు ప్రత్యేక వైద్య నిపుణులు, ముగ్గురు పిల్లల వైద్య నిపుణులు, అయిదుగురు స్త్రీ వైద్య నిపుణులు, ఇద్దరు మత్తుమందు వైద్యులు సేవలను అందించేవారు. ఇటీవల ఇద్దరు ఎముకల వైద్య నిపుణులు, చెవి ముక్కు గొంతుతోపాటు మరో ముగ్గురు స్త్రీ, మత్తుమందు వైద్య నిపుణులను బదిలీ చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఎముకల వైద్య విభాగంలో ఓ వైద్యుడిని డిప్యుటేషన్ వేయగా, ఈఎన్‌టీ వైద్యుడిని ఇంతవరకు నియమించలేదు.

హుజూరాబాద్ ఆసుపత్రి జనరల్ సర్జన్‌కు ఇటీవల జమ్మికుంట ఆసుపత్రికి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలు కేటాయించారు. మరోవైపు హుజూరాబాద్‌లో ఒక్కరే మత్తుమందు వైద్యుడు ఉండగా.. ఆయన ఒక్కరే హుజూరాబాద్, జమ్మికుంట ఆసుపత్రుల్లో



విధులను నిర్వహించాల్సి వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. స్త్రీ వైద్య నిపుణురాలితోపాటు ఇద్దరు మత్తుమందు వైద్యుల అవసరం ఉంది. మరో పది మంది స్టాఫ్ నర్సులు కావాల్సి ఉంది. సమస్యపై హుజూరాబాద్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎ.రాజేందర్‌రెడ్డిని సంప్రదించగా.. వైద్యులు, సిబ్బంది కొరత ఉందని తెలిపారు. పూర్తిస్థాయి సిబ్బంది ఉంటే 24 గంటలపాటూ మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు.

జమ్మికుంటలోనూ.. జమ్మికుంట ఆసుపత్రికి రోజూ 100 నుంచి 170 రోగులు సేవల కోసం వస్తుంటారు కానీ.. ఇక్కడ ఓపీ సేవలే అందుబాటులో ఉన్నాయి. ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌తోపాటు మరో ఆరుగురు వైద్యులు సేవలను అందిస్తున్నారు. అన్ని వార్డులు, ఆపరేషన్ విభాగాలున్నప్పటికి వైద్యులు మాత్రం లేరు. ఎముకలు, దంత వైద్యులు మాత్రమే ఉండగా, కేవలం ఓపీ సేవలు అందిస్తున్నారు. వారానికి రెండు రోజుల మాత్రమే స్త్రీ వైద్య నిపుణురాలు ఇక్కడికి వచ్చి సేవలను అందిస్తున్నారు. దంత వైద్యుడున్నప్పటికి అన్ని పరికరాలు లేకపోవటంతో కేవలం ఓపీ వరకే చూస్తున్నారు. ఫార్మాసిస్టు డిప్యుటేషన్ వస్తుండగా, ల్యాబ్‌లో పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు. కనీసం ఎక్స్‌రే వసతి కూడా అందుబాటులో లేదు. 24 గంటలపాటు అందుబాటులో ఉండే స్త్రీ వైద్య నిపుణురాలు, ఇద్దరు మత్తు మందు, పిల్లల వైద్యులు కావాలి.

# కల్తీ కబళిస్తోంది

కరీంనగర్ : ఆహార పదార్థాలు పండిన చోటు నుంచి లేదా తయారైన చోటు నుంచి వినియోగదారులకు చేరే క్రమంలో కొందరు స్వార్థపరుల వల్ల కల్తీకి గురవుతున్నాయి. పదార్థాలు ఆకర్షణీయంగా ఉండాలనో.. ఎక్కువకాలం నిలువుండాలనో.. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందాలనో ఇలా రకరకాల ప్రయోజనాలు ఆశించి అవసరం లేని రసాయనాలు వాడి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు. అందుకే శరీరంలో ఏదో తెలియని నిస్సత్తువ. కొందరికి తింటే అరగటం లేదు. శుభ్రమైన నీరు.. నాణ్యమైన ఆహార పదార్థాలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఆహారం భద్రతపై ప్రత్యేక కథనం.

**డబ్బులిచ్చీ జబ్బు పడాలా?**

ఉదయం లేచినప్పటి నుంచి డబ్బిచ్చి సేవలు పొందుతున్నాం. ప్రతి సందర్భంలోనూ వినియోగదారులమే. మనకు కావాల్సిన వస్తువులు అమ్మేది, సేవల్ని అందించేది ప్రైవేటు వ్యక్తులు.. సంస్థలు.. ప్రభుత్వమైనా కావచ్చు.. చెల్లించిన సొమ్ముకు తగిన ప్రతిఫలం ఆశించడం వినియోగదారుల హక్కు. డబ్బిచ్చి అనారోగ్యం పాలవడం ఎంతవరకు సమంజసం. అవసరమైనప్పుడు హక్కు వినియోగించుకునే చైతన్యం ప్రతి ఒక్కరిలో ఉండాలని పౌరసమాజం కోరుకుంటోంది.

**కనిపెట్టడం ఇలా..**

చిన్న సీసాలో కొద్దిగా పాలు తీసుకొని గిలకొట్టాలి. డిటర్జెంట్ లాంటివి కలిపితే నురగ ఎక్కువగా వస్తుంది.

తెల్లని బ్లాటింగ్ పేపర్‌ని తడిపి కానీ తడి దూదితో కానీ కూరగాయలు, పండ్లు తుడిస్తే కృత్రిమ రంగు ఉంటే తెలిసిపోతుంది.

ఐస్ క్రీం కొంచెం విడిగా తీసి దానిమీద రెండు చుక్కల నిమ్మరసం పిండాలి. నురగలు వస్తే కల్తీ జరిగినట్లే.

మిరియాలను ఆల్కహాలులో వేస్తే మునిగిపోతాయి. బొప్పాయి గింజలు కలిస్తే తేలుతాయి. పంచదార, ఉప్పుల్లో కల్తీ జరిగినట్లు అనుమానమొస్తే చెంచాడు తీసుకొని నీళ్లలో వేస్తే అవి కరిగిపోతాయి. కల్తీ ఉంటే చాక్‌పొడి అడుగున పేరుకుంటుంది.

కాస్త తేనెలో దూదిని ముంచి తీసి వెలిగిస్తే మండుతుంది. కల్తీ అయితే చిటపటలాడుతుంది.

కరిగిన నెయ్యిలో ఒక స్పూన్ చక్కెర వేసి బాగా కలపాలి. ఐదు నిముషాల తర్వాత అది ఎరుపు రంగులోకి మారితే కల్తీ జరిగినట్లు.

పసుపు కానీ పప్పు కానీ.. కొద్దిగా నీళ్లలో వేసి దాంట్లో కొన్ని చుక్కలు హైడ్రోక్లోరిక్ ఆసిడ్ వేయాలి. మెటానిల్ ఎల్లో కల్తీ జరిగితే నీరు ఊదారంగులోకి మారుతుంది. పసుపులో లెడ్ క్రోమైట్ కలిసినట్లయితే నీళ్లు మరీ ఎక్కువ పచ్చగా మారుతాయి. మంచి పసుపు నీళ్లలో కరగకుండా అడుగున చేరుకుంటుంది.

ఎలా చేస్తారంటే.. పాలు, పాల ఉత్పత్తులు: తరచుగా కల్తీకి గురయ్యేవి నిత్యం వాడే పాలు. అందులో ఏ నీళ్లు పడితే ఆ నీళ్లు కలిపితే అనారోగ్యం తప్పదు. పాల రంగూ, చిక్కదనం కోసం చాక్ పౌడర్, యూరియా, కాస్టిక్ సోడా, హైడ్రోజన్ పెరాక్సైడ్ లాంటివి కలుపడం వల్ల జీర్ణ సంబంధ సమస్యలు, పిల్లల్లో హార్మోన్ల సమస్యలు వస్తాయి.

పప్పులు: ఆకర్షణీయంగా కన్పించేందుకు మెటానిల్ ఎల్లో కలర్ కలుపుతారు. ఇది కలిపిన ఆహారపదార్థాలు తింటే న్యూరోటాక్సిసిటీ అనే సమస్యతో నాడీ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంది.

మసాల దినుసులు: మిరియాల్లో బొప్పాయి గింజలు, పసుపులో మెటానిల్ ఎల్లో, రెడ్ ఆక్సైడ్, ఇంగువలో మట్టి, కారంలో ఇటుక పొడి కలుపుతారు. ఖరీదైన కుంకుమ పువ్వులో మొక్కజొన్న పీచును కలుపుతారు. కూరగాయలు, పండ్లు: కాపు ఎక్కువగా వచ్చేందుకు, పురుగు పట్టకుండా ఉండేందుకు ఎన్నో రసాయన మందులు వినియోగిస్తున్నారు. ఆకర్షణీయంగా కనిపించడానికి రసాయన రంగుల్ని ఇంజెక్ట్ చేస్తారు. ఆకుపచ్చని కూరలు మరింత పచ్చగా తాజాగా కనిపించేందుకు మాలకైట్ గ్రీన్ అనే రసాయన రంగు క్యాన్సర్ కారకం కూడా. ఇంకా ఆక్సిటోసిన్, శాకరిన్, వ్యాక్స్, కాపర్ సల్ఫేట్ వంటివి వాడుతున్నారు.

**ఇదీ నేపథ్యం..**

1945లో ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ స్థాపనకు గుర్తింపుగా ఏటా అక్టోబర్ 16న ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 'మంచి భవిష్యత్తు కోసం ఆహారం అందించడమే లక్ష్యం' అనే థీమ్‌ను ఈ ఏడాది తీసుకున్నారు.

వృథా వద్దు..

జనాభాకు అనుగుణంగా అవసరమైన ధాన్యంతోపాటు ఇతరత్రా ఆహార పదార్థాలు సరిపోవడం లేదు. శుభకార్యాల సందర్భంగా మిగిలిన ఆహారం వృథాగా పాడేస్తున్నారు. అవే పదార్థాలను అనాథలకు, పేదలకు అందాలనే సంకల్పంతో కొందరు స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారు. వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమం 9949 914242కు ఫోన్ చేస్తే వారే వ్యాన్ లేదా ఆటోలో వచ్చి ఆహారం తీసుకొని వెళ్తారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ దంపతులు ఆరేళ్లుగా శుభకార్యాల్లో మిగిలిన ఆహారాన్ని స్లమ్ ఏరియాలోని కుటుంబాలకు అందిస్తున్నారు. 93945 05101కు ఫోన్ చేస్తే వారే అద్దె ఆటోలో తీసుకెళ్లి పేదలకు అందిస్తున్నారు.

రంగులు కలిపితే సమస్యలు తప్పవు

సాయి ప్రియ, న్యూట్రీషియనిస్ట్, కరీంనగర్

ఆహార పదార్థాల్లో రసాయన రంగులు కలపడం వల్ల క్యాన్సర్, రక్తహీనత సమస్యలు తలెత్తుతాయి. జంక్ ఫుడ్, మంచూరియా, చిల్లీ పౌడర్, ఆయిల్స్, రెడీ ఈట్ ఫుడ్‌లో ఇవి ఎక్కువగా కలిసే అవకాశం. ప్యాకెట్ ఫుడ్‌లో ఏయే పదార్థాలు కలిపారో చూసుకొని తినాలి. ఎక్కువగా కొబ్బరి, ఇతరాత్ర చెట్ల పాలు తాగడం మంచిది. సహజంగా దొరికే ఆకు కూరలు, కూరగాయలు తీసుకోవాలి.

# కాలుష్య తనిఖీలకు ఆమడ దూరం

హైదరాబాద్ : కాలుష్య తనిఖీలకు గ్రేటర్‌లోని వాహనదారులు ఆమడ దూరం ఉంటున్నారు. ఉచిత డ్రైవ్ నిర్వహించినా స్పందించడం లేదు. ఇటీవల కాలుష్య నియంత్రణ మండలి గ్రేటర్‌లోని ఆరు ప్రాంతాల్లో ఉచిత పీయూసీ (పొల్యూషన్ అండర్ కంట్రోల్ డ్రైవ్) నిర్వహించింది. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌లో భాగంగా సెప్టెంబర్ 7న ఈ డ్రైవ్‌ను నిర్వహిస్తే కేవలం 390మంది వాహనదారులు మాత్రమే తనిఖీలు చేయించుకున్నారు. గ్రేటర్‌లో 80లక్షలకు పైగా వాహనాలుంటే పాల్గొంది 0.005శాతం మాత్రమే. దీన్నిబట్టి పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉచిత డ్రైవ్ నిర్వహించిన ప్రాంతాలివే..: కాలుష్య ఉద్గారాలతో ఇంధన సామర్థ్యం, ఆరోగ్యంపై ప్రభావంతోపాటు నేషనల్ క్లీన్‌ఎయిర్ ప్రోగ్రామ్‌పై అవగాహన కల్పించేందుకు పీసీబీ ఈ ఉచిత డ్రైవ్‌ను చేపట్టింది. ఎల్బీనగర్ క్రాస్‌రోడ్స్, ఉప్పల్ భగాయత్, నాంపల్లి పోలీస్ కంట్రోల్ రూమ్, ప్రసాద్ ఐమాక్స్, దుర్గం చెరువు సమీపంలో, మియాపూర్ మెట్రోస్టేషన్ ప్రాంతాల్లో చేపట్టిన కార్యక్రమానికి సగటున 80మంది కూడా రాలేదు. పీయూసీ సర్టిఫికేట్, తనిఖీలు చేయించుకున్నారనే అంశంలో నిఘా లేకపోవడంతో డొక్కు వాహనాలు రోడ్డెక్కి కాలుష్యాన్ని పెంచేస్తున్నాయి. నగరంలో 70శాతం వాహనదారులు పీయూసీ తనిఖీలకు ఆసక్తి చూపడం లేదని, కాలుష్య ఉద్గారాల నమోదును దాచిపెడితే రూ.2వేల నుంచి రూ.5వేల వరకు జరిమానా పడొచ్చని హెచ్చరిస్తున్నారు.

# ధాన్యం కొనుగోళ్లు.. మహిళలకు సిరులు

సిరిసిల్ల: ఒకవైపు కుటుంబ బాధ్యతలు చూస్తూనే మరోవైపు మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు అండగా నిలుస్తున్నారు అతివలు.. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో ఏడేళ్లలో ధాన్యం కొనుగోలు చేసి రూ.9.87 కోట్ల కమీషన్ పొంది ఆదర్శంగా నిలుస్తున్నారు.

**సమన్వయంతో విజయం**

రైతులు పండించిన ధాన్యం సేకరణకు ప్రభుత్వం 2006లో ఐకేపీ కొనుగోళ్లు ప్రారంభించింది. తొలుత జిల్లాలో 58 సంఘాలు ఉండగా ఈ సీజన్‌లో 44 కేంద్రాలు సేకరిస్తూ సహకార సంఘాలకు దీటుగా నిలుసుస్తున్నాయి. జిల్లా ఆవిర్భావం నుంచి ఇప్పటికీ రూ.7.17 కోట్లు కమీషన్ రూపంలో పొందారు. 2023-24 సంవత్సరంలోని రెండు సీజన్‌లకు సంబంధించిన రూ.2.70 కోట్ల కమీషన్ ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సి ఉంది.

మహిళా సంఘాల్లోని బుక్ కీపర్, సభ్యురాలు, సీఏ కలిసి కేంద్రాల బాధ్యతలు చూసుకుంటున్నారు. అధికారులు, రైతులను సమన్వయం చేసుకుంటూ ధాన్యం మిల్లులకు సకాలంలో చేరేలా శ్రమిస్తున్నారు.



రైతుల డబ్బులు ఎప్పటికప్పుడు వారి ఖాతాలో జమ చేయిస్తున్నారు. ప్రభుత్వం క్వింటాకు రూ.32 చొప్పున కమీషన్‌ను సంఘాలకు అందించింది. జిల్లాలోని ఐకేపీ ద్వారా 2018-19 వరకు పలు మండలాల్లో సంఘాలకు వచ్చిన కమీషన్‌తో కొనుగోలు కేంద్రాల నిర్వహణకు సొంతంగా స్థలాలు కొనుగోలు చేశారు.

కోనరావుపేట మండల కేంద్రం, గంభీరావుపేట మండలం లింగన్నపేట, తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లి గ్రామాల్లో మహిళా సంఘం భవనాలు నిర్మించుకున్నారు.

2018 నుంచి కమీషన్‌గా వచ్చిన సొమ్ములో 45 శాతం జిల్లా సమాఖ్యకు, 45 శాతం స్త్రీనిధిలో డిపాజిట్ చేసుకుంటున్నారు. పదిశాతం కేంద్రాల నిర్వహణకు ఖర్చుచేస్తున్నారు.

బలోపేతం చేసుకుంటాం

మాకు వచ్చిన కమీషన్ డబ్బుల్లో నిర్వహణ ఖర్చులు పోను రూ.3 లక్షలతో మూడు గుంటల స్థలం తీసుకున్నాం. దీనిలో గ్రామ మహిళా సమాఖ్య భవనం నిర్మించుకున్నాం. ప్రతి సీజన్‌లో కొనుగోళ్లకు వచ్చే హమాలీలు, సుతిలి, గన్నీ సంచులను భద్రపర్చడం కోసం గోదాం పక్కన రూ.2 లక్షలతో రెండు గదుల భవనం నిర్మించాం. మిగిలిన వాటిని సంఘం సంఘం అభివృద్ధికి ఖర్చు చేయనున్నాం. వాటితో సంఘాన్ని బలోపేతం చేసుకుంటాం.

**సరిత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు, గోపాల్‌రావుపల్లి**

**అవకాశాలు అందిపుచ్చుకోవాలి**

ప్రభుత్వం అందించే అవకాశాలను మహిళా సంఘాలు అందిపుచ్చుకొని ఆర్థికంగా బలపడాలి. ఏటా గ్రామ సంఘాల సభ్యులకు ధాన్యం కొనుగోలు బాధ్యతలు అప్పగిస్తున్నాం. సమర్థంగా నిర్వహిస్తూ అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు. వచ్చిన కమీషన్‌తో పలు సంఘాలు లాభాల బాటలో ఉన్నాయి. శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

# రైతువేదిక.. నిధులు లేక

తిర్యాణి : సాగులో వస్తున్న మార్పులపై అన్నదాతలకు అవగాహన కల్పించే లక్ష్యంతో గత ప్రభుత్వం రైతు వేదికలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో 70 వ్యవసాయ క్లస్టర్లను ఏర్పాటు చేసి రైతు వేదికలను నిర్మించారు. వాటిలో ఏఈవో కోసం ప్రత్యేక గది, స్టోర్ రూం, సమావేశాల కోసం హాల్ ఏర్పాటు చేశారు. గతంలో ఒక్కో వేదికకు 120 కుర్చీలు, టేబుల్, మైక్‌లను ప్రభుత్వం పంపిణీ చేసింది. నెలనెలా నిర్వహణకు రూ.9 వేలు ఇస్తామని ప్రకటించింది. కొన్ని నెలలపాటు చెల్లించారు. రెండేళ్లకు పైగా ఈ నిధులు నిలిచిపోవడంతో ఏఈవోలు జేబులో నుంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితి.

ఒక్కో రైతు వేదిక నిర్మాణానికి అప్పట్లో ప్రభుత్వం రూ.22 లక్షలు కేటాయించింది. ఈ నిధులు సరిపోక చాలా చోట్ల మరుగుదొడ్లు, మూత్ర శాలలు నిర్మించలేదు. ప్రభుత్వానికి నివేదించి అదనపు బిల్లులు మంజూరు చేస్తామని అప్పట్లో ప్రజాప్రతినిధుల సూచనతో కొన్నిచోట్ల గుత్తేదారులు వీటిని ఏర్పాటు చేసినా.. ఇప్పటికీ బిల్లులు రాలేదని వాపోతున్నారు. 59 వేదికలకు విద్యుత్తు వసతి ఉంది. వీటికి రూ.9.93 లక్షలు బకాయిలు పేరుకుపోయాయి.

**రెండేళ్లకు పైగా ఎదురుచూపులు**జిల్లాలో 2022, ఆగస్టులో అయిదు నెలలకు సంబంధించి నిర్వహణకు రూ.31.50 లక్షలను అప్పటి ప్రభుత్వం విడుదల చేసింది. వీటిని ఏఈవోలకు అందించినట్లు



వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఆ తరువాత నుంచి ఇప్పటి వరకు దాదాపు 27 నెలలుగా నిధులు నిలిచిపోయాయి. నెలకు ఒక్కోదాని నిర్వహణకు రూ.9 వేల చొప్పున లెక్కిస్తే.. జిల్లాలోని 70 రైతు వేదికలకు ఏడాదికి రూ.6.30 లక్షలు అవుతాయి. 27 నెలలకు సంబంధించి రూ.1.70 కోట్లు బకాయిలు రావాలి.

**అంతర్జాల వసతిలేదు..**

రైతులకు వ్యవసాయ పరంగా సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ప్రతి రైతునేస్తం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. మండలానికో రైతు వేదికను ఎంపిక చేసి కొనసాగిస్తున్నారు. జిల్లాలోని 15 మండలాల్లోని 15 వేదికల్లో కార్యక్రమ నిర్వహణకు కంప్యూటర్, ఎల్‌ఈడీ తెర, మైక్ వంటివి అందించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పిస్తారు. అయితే అంతర్జాల సౌకర్యం లేక ఏఈవోలే సొంతంగా డాటాను వినియోగిస్తున్నారు.

**మంజూరైతే చెల్లిస్తాం శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి**

రైతు వేదికల నిర్వహణ నిధులు రెండేళ్లకు పైగా రావడంలేదు. రైతుల సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించినపుడు ఏఈవోలే ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే వారికి చెల్లిస్తాం.

# మధ్యాహ్న భోజనం.. నాసిరకం



గంగాధర: సర్కారు బడుల్లో విద్యార్థుల ఆకలి తీర్చేందుకు కొన్నేళ్లుగా ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. గత కొన్ని రోజులుగా గురుకులాలతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ ఘటనల నేపథ్యంలో మధ్యాహ్న భోజనం వండుతున్న తీరు, ఎలాంటి నిబంధనలు పాటించాలో కథనం.

ఇటీవల జిల్లాలో జరిగిన ఘటనలు..రెండు రోజుల కిందట గంగాధర మండలం బూర్గుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 18 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. స్థానికంగా వైద్యం పొంది 17 మంది యథావిధిగా పాఠశాలకు హాజరయ్యారు. కొందరు పిల్లలు ఇళ్ల నుంచి తెచ్చుకున్న బాక్స్‌ల్లోనే భోజనం చేశారు.

ఇటీవల పాఠశాలకు సరఫరా చేసిన బియ్యంతో వండిన అన్నం ముద్దగా మారి తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని పాఠశాలను సందర్శించిన డీఈవో జనార్దన్‌రావు తేల్చారు. జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌ను కలిసి.. సమస్య వివరించి పాత బియ్యం అందించేలా చొరవ చూపుతామని పౌరసరఫరాల శాఖ డీఎం రజనీకాంత్ తెలిపారు.

ఈ నెల 12న తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని మహాత్మా జ్యోతిబాపులే బాలుర గురుకుల పాఠశాలలో అన్నం ముద్దగా ఉంటుందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. వారం రోజులుగా కడుపునొప్పి, వాంతులతో అస్వస్థతకు గురయ్యామని వాపోయారు. కొత్త బియ్యం కారణంగానే ఇలా జరిగిందని పాఠశాల ఉపాధ్యాయులు సెలవిచ్చారు.

జిల్లాలో వివరాలు...

ప్రభుత్వ పాఠశాలలు : 722

విద్యార్థులు : 55,934

వంటలు వండే సమయంలో మార్గదర్శకాలు..

సరైన నీటిని వాడాలి. బోరుబావి నీరు కాకుండా కుళాయి లేదా శుద్ధజలాన్ని ఉపయోగించి బియ్యం ఉడికించాలి. బోరుబావి నీరు కఠినంగా ఉండి అన్నం నాణ్యతను ప్రభావితం చేస్తుంది. వండే ముందు బియ్యాన్ని నీటితో రెండుసార్లు శుద్ధి చేయాలి.

అన్నంలో జిగటును నివారించడానికి, వేడి నీటిలో కొద్ది మొత్తంలో ఎడిబుల్ ఆయిల్‌ను జోడించాలి. ఇది బియ్యం గింజలను వేరుగా ఉంచడానికి సహాయపడుతుంది.

వంట చేసేటప్పుడు అదనపు నీటిని జోడించకుండా ఉండాలి. కావాల్సిన ఆకృతిని సాధించడానికి అవసరమైన నీటిని మాత్రమే వినియోగించాలి. ఎందుకంటే ఎక్కువ నీరు మెత్తని బియ్యానికి దారి తీస్తుంది.

వంట చేసే ప్రదేశం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చెట్ల కొమ్మల ఆకులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

కూరగాయలు శుభ్రంగా కడిగి వండాలి. పుచ్చుల్లాంటివి తీసివేయాలి.

నాణ్యమైన సరకులు వాడాలి.

కొత్త బియ్యంతోనే ఈ సమస్య

కొత్త బియ్యం వంటతోనే అన్నం ఉడికీ ఉడకక ఉండలుగా మారి విద్యార్థులు తినడానికి ఇబ్బంది పడుతున్నారని మా దృష్టికి వచ్చింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఇవే సరఫరా చేశాం. ఆ బడుల్లో అప్పటికే ఉన్న పాత బియ్యంతో వంట చేయడంతో ఈ సమస్య రాలేదు. ఆహార పదార్థాలు, తాగునీటి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించాం. అధికారులకు చెప్పి మార్పిస్తాం. జనార్దన్‌రావు, డీఈవో

# మనం పీల్చేదిది రో'గాలే'..!



కరీంనగర్ : మనం నిత్యం పీల్చేది గాలి కాదు.. గరళం. అవునండీ.. ఇది నిజం. మనకు తెలియకుండానే గాలి కలుషితమవుతోంది. ఉమ్మడి జిల్లాలో వాయు కాలుష్యం గత కొన్నాళ్లుగా తీవ్రరూపం దాలుస్తోంది. పీల్చే గాలిని విషతుల్యం చేసే సూక్ష్మ ధూళికణాలు ఆరోగ్యానికి సవాలు విసురుతున్నాయి. కరీంనగర్, గోదావరిఖనిలాంటి పట్టణాల్లో ఉపకరణాలు ఏర్పాటు చేయగా వీటి తీవ్రత తెలుస్తోంది.. మిగతా పట్టణాల్లోనూ గాలి నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతోంది.

సగటు క్యూబిక్ మీటరు గాలిలో సూక్ష్మ ధూళి కణాల పరిమాణ ప్రమాణాలు

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ప్రకారం 60 మైక్రోగ్రాములకు మించొద్దు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రకారం 20 మైక్రోగ్రాములు దాటొద్దు.

వాయు కాలుష్యంతో 40 రకాల కాలుష్య ఉద్గారాలు విడుదలవుతాయి. ఇందులో అతి సూక్ష్మ ధూళికణాలు (పీఎం 2.5) సూక్ష్మ ధూళి కణాలు (పీఎం 10), నైట్రోజన్ ఆక్సైడ్‌లు, సల్ఫర్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ మొదలగు విష పదార్థాలుంటాయి. ఇందులో పీఎం 2.5, పీఎం 10 అత్యంత ప్రమాదకరమైనవి.

ఉమ్మడి జిల్లాలో రెండు నగర పాలక సంస్థలు, 14 పురపాలికల్లో కాలుష్యం ఎక్కువగా ఉంది. రోజుకు సగటున 400 వాహనాలు పెరుగుతుండటం, రోడ్ల విస్తరణ పనులు పెరగడంతో గాలిలో ధూళి పెరుగుతోంది. పంచాయతీలు, పురపాలికల్లో వ్యర్థాలను కాల్చడం కూడా ముప్పుగానే మారింది.

పంట కాలిస్తే ప్రమాదమే..!

ఉమ్మడి జిల్లాలో 8 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. ఇందులో దాదాపుగా 3లక్షల ఎకరాల్లో పంటకోత తరువాత కొయ్యలను పొలంలోనే కాలుస్తారు. టన్ను గడ్డి మండిస్తే అందులో నుంచి 2 కిలోల సల్ఫర్‌డైఆక్సైడ్, 3 కిలోల పార్టికల్ మీటర్, 60 కిలోల కార్బన్ మోనాక్సైడ్, 1460 కిలోల కార్బన్‌డై ఆక్సైడ్, 199 కిలోల బూడిద ధూళి గాల్లో కలుస్తుంది. పొలాల్లో గడ్డిని కాల్చకుండా అందులోనే నీళ్లు పెట్టి కుళ్లిస్తే నేల మరింత సారవంతమవుతుంది.

పూర్తి స్థాయిలో లెక్కిస్తే..

తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) కరీంనగర్, గోదావరిఖనిలో రెండు చోట్లనే గాలి నాణ్యతను లెక్కిస్తుంది. మరెక్కడా లేవు.

కనీసం జిల్లాకు నాలుగైదు చోట్ల ఉపకరణాలు ఉంటే తీవ్రత పూర్తిస్థాయిలో తెలిసే వీలుంటుంది.

కరీంనగర్ డంపింగ్ యార్డు, రామగుండం థర్మల్ ప్రాజెక్టు, గనుల చెంతన గాలిలో ఉద్గారాలెక్కువ. ప్రధాన పట్టణాల్లో ఎక్కడా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం గాలి నాణ్యత ఉండదు.

ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో కరీంనగర్, గోదావరిఖని పట్టణాల్లో గాలి నాణ్యత సూచీ 100ను దాటింది. గోదావరిఖనిలో 111 వరకు నమోదైంది.

సమస్య వీటితోనే..

ధ్వంసమైన రోడ్లు

మట్టి రహదారులు

గనుల వద్ద దుమ్ము

పరిశ్రమల పొగ

పాత వాహనాల పొగ

డంప్‌యార్డు, చెత్త పొగ

పొలాల్లో పంటలకు నిప్పు

భవన నిర్మాణాల దుమ్ము

పాత వాహనాలతో నష్టం

గడవు తీరిన వాహనాలు పొగ రూపంలో ధూళికణాలు, నైట్రోజన్ ఆక్సైడ్ సహా కాలుష్య ఉద్గారాలను గాల్లోకి వదులుతాయి. ఉమ్మడి జిల్లాలో 2014 మార్చి వరకు 5.61లక్షల వాహనాలున్నాయి. ప్రస్తుతం ఆ సంఖ్య 11.20 లక్షలకు చేరింది. ఇందులో 15 ఏళ్లు దాటిన వాహనాలే 2లక్షలకుపైగా ఉండటంతో వాటినుంచి వెలువడే పొగ ప్రమాదకరంగా మారుతోంది.

ఇలా చేయాలి..

వ్యర్థాలను కాల్చడం మానేయాలి.

వాహనాల కాలుష్య తనిఖీ చేపట్టాలి.

పరిశ్రమలు కాలుష్యం తగ్గించే సాంకేతికతను వాడాలి.

ప్రమాదకర ఉద్గారాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి.

రోడ్ల మరమ్మతులు ఎప్పటికప్పుడు చేపట్టి దుమ్ము, ధూళి తీవ్రత తగ్గించాలి.

మాస్క్‌ను విధిగా ధరించడం అలవాటు చేసుకోవాలి.

ఆరోగ్యానికి 'పొగ'

గాలిలో ప్రమాదకరమైన దుమ్ము, ధూళి కణాల వల్ల ఆరోగ్యం పాడవుతుంది. ఊపరితిత్తులు, గుండె, మెదడులపైన ప్రభావం పడుతుంది. పరిశ్రమల పొగ, నేల, రహదారులపై నుంచి లేచే ధూళి, గనుల నుంచి వెలువడే దుమ్ము. వాహనాల పొగ, బొగ్గు మసి, పుప్పొడి రేణువులు, వివిధ రకాల బూడిద గాల్లో తేలుతుంటాయి. ఇవి నేరుగా నోరు, ముక్కు ద్వారా మన శ్వాసకోశ నాళాల్లోకి సులభంగా వెళ్తాయి. ఈ గాలి పీల్చితే ఆస్తమా, సీవోపీడీ (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్), గుండెపోటు, క్యాన్సర్ వచ్చే ప్రమాదముంది. వసీం, ఛాతివ్యాధి నిపుణులు, కరీంనగర్

# కాసుల బాసులు..

ఆసిఫాబాద్: అత్యంత వెనుకబడిన జిల్లాలో అడుగడుగునా సమస్యలు ఉన్నాయి. కనీస మౌలిక వసతులు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల దగ్గరకు చేర్చి, పాలనను పట్టాలెక్కించాల్సిన అధికారులే దారి తప్పి ప్రవర్తించడం జిల్లావాసులకు శాపంలా మారుతోంది. ఈ చోటుకు రావడానికి వెనుకాడే అధికారులు ఒకవైపు, వచ్చిన వారు వీలయినంత సంపాదించాలనే దురుద్దేశంతో పనిచేయడం వల్ల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే తరహాలో మారుతోంది. గతంలో పనిచేసిన వారు ఇదేతీరున వ్యవహరించడం ఆ తర్వాత బదిలీపై వెళ్లడంతో కొత్తవారైనా తమ కష్టాలు తీర్చుతారనే ప్రజల ఆశలు ప్రతిసారీ అడియాసలవుతున్నాయి. తండ్రి చనిపోతే కారుణ్య నియామకం పరిధిలో రెండేళ్ల కిందట ఉద్యోగంలో చేరిన ఓ వ్యక్తి నేడు అక్రమార్జనకు చిరునామాగా మారాడు. బాసుల అండదండలు, మరో అధికారి సహకారంతో అయినకాడికి దండుకుంటున్నారు. జిల్లాలో చాలా మంది సీనియర్లు ఉండగా, ఓ అధికారి సదరు వ్యక్తిని తన దగ్గర పెట్టుకుని, వసూళ్ల దందాకు తెరతీశారనే ప్రచారం సాగుతోంది. ఏదైనా ఫైల్ ముందుకు కదలాలంటే, బాస్‌కు ఇస్తున్నారు కదా, నాకు ఇంత ఇవ్వాలనే డిమాండ్ పెడుతున్నాడు. సమస్యలను స్వయంగా గుర్తించి వారితోనే దరఖాస్తులు పెట్టించి పరిష్కరించేందుకు రూ.లక్షలు అడిగిన



తీరుపై అధికారులందరూ విస్మయానికి గురవుతున్నారు. జిల్లాలో చాలా అధికారులు అక్రమార్జనకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

**అక్రమాల తీరిది..**

జిల్లాలో పెట్రోల్‌బంక్ ఓ వ్యక్తికి మంజూరైంది. వివిధ రకాల అనుమతులు పొందే క్రమంలో ఫైల్ బాస్ దగ్గరకు వచ్చింది. బాస్ వెంటనే నమ్మినబంటుకు ఈ పని చక్కబెట్టాలని ఆదేశించాడు. అతను కొంత మొత్తం కావాలని డిమాండ్ చేయడంతో బాధితుడు ఆశ్చర్యపోయాడు. రూ.లక్షల్లో ఇచ్చుకోలేనని, తన వద్ద పత్రాలన్నీ సక్రమంగా ఉన్నాయని మొరపెట్టుకున్నా.. తన అనుచరుడి వద్దకు వెళ్లాలని బాస్ చెప్పడంతో బాధితుడు ఏం చేయలేని పరిస్థితి.

బడా గుత్తేదారుకు చెందిన భూమి ధరణిలో సమస్య ఉంది. దీనిని సరిచేయడానికి భారీ మొత్తంలో డిమాండ్ చేశారు. ఇంత ఇవ్వలేను చూడండని అనడంతో మరో అధికారి వీరి మధ్య డీల్ చేస్తున్నట్లుగా సమాచారం. జిల్లా వ్యాప్తంగా ధరణి సమస్యలు 1300 పైగా ఉన్నాయి. వీరి సమస్యలను పరిష్కరించే క్రమంలో వారికి సంప్రదించి, నచ్చినకాడికి తీసుకుంటున్నారు. మరోవైపు కొందరు వ్యక్తులతో స్వయంగా దరఖాస్తులు సమర్పించి, అనంతరం కాసులు తీసుకుని పనికానిచ్చేస్తున్నారు. ధరణి వెబ్‌సైట్ను ప్రభుత్వం త్వరలోనే రద్దు చేయనున్న నేపథ్యంలో అప్పటి వరకు వీలయినంత జేబులు నింపుకొందామని సదరు వ్యక్తుల దురాలోచనగా ఆరోపణలు ఉన్నాయి. సొంత వ్యక్తులు చనిపోయి పుట్టెడు దుఃఖంతో ఉండి, కారుణ్య నియామకాల కోసం తిరుగుతున్న బాధితుల నుంచి సైతం వసూళ్ల పర్వం కొనసాగుతుందని తెలుస్తోంది. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు బిర్యాని, భోజనాలు పెట్టే వ్యక్తికి వచ్చిన బిల్లులో సైతం కమీషన్ కావాలని అడగడంతో సదరు హోటల్ యజమాని బిత్తరపోవాల్సి వచ్చింది. ఏ బిల్లులోనైనా 2 శాతం కమీషన్ కావాలని బాస్ అంటున్నాడని చిన్నబాస్ చెప్పడం, తనకు కొంత ఇవ్వాలని కోరడం, ఈ విషయం బయటకు పొక్కడంపై ప్రజలు అధికారుల తీరును చీదరించు కుంటున్నారు.

# సోయా విక్రయాలకు పడిగాపులు

ఆదిలాబాద్ : సోయా విక్రయాల్లో రైతులకు కొత్తకష్టాలు మొదలయ్యాయి. అన్నదాతల నుంచి కొనుగోలు చేసిన సోయా సంచులకు రైతు పేరున క్యూఆర్ కోడ్ జారీ అవుతుంది. దాన్ని సంచికి జత చేయాల్సి ఉంటుంది. గోదాంలకు పంపించిన తర్వాత కూడా ఏ కేంద్రం నుంచి ఏ రైతు నుంచి కొనుగోలు చేశారనే వివరాలు తెలుసు కునేందుకు వీలుగా సంచులపై క్యూఆర్‌కోడ్ జత చేస్తున్నారు. నాలుగు రోజుల నుంచి క్యూఆర్ కోడ్ స్లిప్పులు రాక రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం జిల్లాల వారీగా సోయా కొనుగోళ్ల లక్ష్యాన్ని విధించింది. జిల్లాలో లక్ష క్వింటాళ్ల సోయా కొనుగోలుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. అంచనాకు మించి సోయా మార్కెట్‌కు రావడంతో ఇప్పటి వరకు లక్ష్యానికి మించి సోయాను కొనుగోలు చేశారు. ఇతర జిల్లాలో పెద్దగా విక్రయాలు లేకపోవడంతో ఆయా జిల్లాలకు కేటాయించిన లక్ష్యాన్ని జిల్లాకు కేటాయించి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. మూడు రోజులుగా సోయా కొనుగోళ్లకు సంబంధించిన అనుమతులు రాక, క్యూఆర్ కోడ్ జారీ కాలేదు. అప్పటికే సోయాను బస్తాలో నింపి రైతులు ఎదురుచూస్తున్నారు.జైనథ్ మార్కెట్‌లో క్యూఆర్ కోడ్లు రాక పేరుకుపోయిన సోయా నిల్వలు ఇవి. ఇక్కడ భారీగా సోయా రావడం, అవసరం మేరకు క్యూఆర్ కోడ్ స్లిప్పులు రాక సోయాను విక్రయించిన రైతులు మార్కెట్‌లోనే మూడు రోజులుగా చలిలోనే పడిగాపులు కాస్తున్నారు.

ఆదిలాబాద్‌లో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న సోయా ఇది. గతంలో విక్రయించిన సోయా సంచులు రవాణా కాక ఇతర రైతులు సోయాను మార్కెట్‌లోనే నిల్వ చేసుకొని విక్రయాల కోసం ఎదురుచూస్తున్నారు.

జైనథ్ మండలం బాలాపూర్ గ్రామానికి చెందిన దత్తు అనే రైతు ఈ నెల 21న సోయాను తీసుకొని రాగా, తేమ శాతం తదితర వాటిని పరిశీలించి కొనుగోలు చేశారు. తీరా క్యూఆర్ కోడ్ స్లిప్పులు లేవు. అవి వచ్చే వరకు సోయా పంట బాధ్యత మీదే అని అధికారులు చెప్పడంతో రెండు రోజులుగా మార్కెట్‌లోనే ఉంటున్నాడు.

జైనథ్ మండలం సావాపూర్‌కు చెందిన రమేశ్ ఈ నెల 20న సోయాను విక్రయించేందుకు వచ్చారు. ఒకరోజు తర్వాత కొనుగోలు చేశారు. అప్పటి నుంచి క్యూఆర్ కోడ్ స్లిప్పులు లేవు. అవి రాగానే జత చేసిన వెళ్లాలని చెప్పడంతో నాలుగు రోజులుగా అక్కడే ఉన్నారు.

ఆందోళన అవసరం లేదు

ప్రవీణ్‌రెడ్డి మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్, ఆదిలాబాద్

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రతి రైతు నుంచి మద్దతు ధరతో సోయాను కొనుగోలు చేస్తాం. రోజు వారీగా కొనుగోలు చేసే మొత్తం కంటే ఎక్కువ మొత్తంలో సోయా రావడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. క్యూఆర్ కోడ్ స్లిప్పులు జారీ కాగానే కేంద్రాలకు పంపిస్తున్నాం.

# ఆదరణ లేక.. 'ఆట'విడుపు అయ్యాను

జగిత్యాల : జిల్లాలో వెయ్యికి పైగా బడులు, లక్షన్నర వరకు విద్యార్థులు ఉన్నారు. సర్కారు బడుల్లో సగం చోట్ల మైదానాలు లేవు. కనీసం సగం మంది కూడా వ్యాయామ ఉపాధ్యాయులు లేరు. ఇక ప్రైవేటు బడుల్లో మైదానాల సంఖ్య వేళ్ల మీద లెక్కించొచ్చు. వీటిలో వ్యాయామ ఉపాధ్యాయులున్నా విద్యార్థులను నియంత్రించడంలోనే నిమగ్నమవుతున్నారు. వారంలో కనీసం మూడు క్రీడా తరగతులు నిర్వహించాలనే నిబంధన ఎప్పుడో అటకెక్కించేయడంతో నేను 'ఆట'విడుపునయ్యాను. పాపం విద్యార్థులు క్రీడా ప్రపంచం ఏంటో తెలియకుండానే, పుస్తకాల పురుగులుగా నాలుగు గోడల మధ్య నలిగిపోతున్నారు.

**చరవాణి మింగేస్తోంది..**

చిన్నారులకు మార్గదర్శనం చేయాల్సిన యువత తామే చరవాణికే పరిమితం కావడం బాధేస్తోంది. ఒకప్పుడు నన్ను ఆదరించి ఆరోగ్యంతో ఉండేవారు. ఇప్పుడేమో సృతజనాత్మకతకు చోటే లేకుండా ఆన్‌లైన్ ఆటలతో విలువైన కాలాన్ని వృథా చేస్తున్నారు. చిన్న కష్టం వచ్చినా, మనసుకు చిన్న గాయమైనా తట్టుకోలేకపోతున్న మిమ్మల్ని చూస్తే నా మనసు కలచివేస్తోంది. నా దరి చేరితే గెలుపు, ఓటముల రుచులతో క్రీడాస్ఫూర్తి మీలో ఎనలేని ఆత్మవిశ్వాసం నింపుతుంది. ఇంతే కాదు, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకొని విజయం కోసం మళ్లీ పోరాడాలనే బలమైన ఆకాంక్షకు బాటలు వేస్తుంది. ఇదే కోవలో అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటిన మన జగిత్యాల జిల్లా బిడ్డలు బాస మహేశ్, బుచ్చన్నగారి రాజు, నవీన్‌కుమార్ మాటల్లో చెప్పాలంటే బాల్యం నుంచే చదువుతో పాటు క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాలి.

**కనీస ప్రోత్సాహం కవు..**

జిల్లాలో పట్టణ, మండలాల్లో ఆటలాడే వారు లేకపోవడం, క్రీడాకారులు ఉంటే సరైన మైదానాలు, వసతుల లేమి ఒకింత ఆందోళన కలిగిస్తోంది. దశాబ్దం కిందట మంజూరైన మినీస్టేడియాలు జగిత్యాల, కోరుట్లలో పూర్తయినప్పటికీ ప్రతిభను వెలికి తీసి మెలకువలు నేర్పించే శిక్షకులు లేకపోవడం, మెట్పల్లి, రాయికల్‌లోని మినీస్టేడియాల పనులు నేటికీ పూర్తికాకపోవడం విస్మయం కలిగిస్తోంది. గతంలో రాష్ట్ర మంత్రి ప్రాతినిథ్యం వహించిన ధర్మపురిలో మినీస్టేడియం ఊసే లేకపోవడం, జిల్లా అంతటా దాతలపై ఆధారపడి పోటీలు నిర్వహించడం, మండలాల్లో కనీస ప్రోత్సాహం లేకపోవడం నాకు మనోవేదన కలిగిస్తోంది.

**చిన్ని ఆశ..**

మీరు మైదానంలో అడుగిడగానే ఆదరించి మీలో స్ఫూర్తి పెంపొందించడమే నా ధ్యేయం. ఆత్మవిశ్వాసం నింపి విజయానికి బాటలు వేయాలని నా తపన. మీరంతా మైదానంలో కేరింతలు కొడితేనే నా జీవితానికి సార్థకత. మీరు లక్ష్యంతో సాధన చేస్తుంటే ఎనలేని సంతోషం నాకు. ఎవరు గెలిచినా సంబరపడేది నేనే. ఎవరు సత్తా చాటినా ముసిముసి నవ్వులతో మురిసిపోయేదీ నేనే. అలాంటిది నేటి పరిస్థితులు చూస్తుంటే నాకు చెప్పలేనంత బాధగా ఉంది. ఇకనైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, క్రీడాభిమానులు పరిస్థితులు చక్కదిద్దుతారని చిన్ని ఆశతో నా గోడు వెళ్లబోసుకుంటున్నాను.


**బద్ధకం వీడితేనే..**

నన్ను ఆదరించి అక్కున చేర్చుకుంటే వ్యాధులు మీదరి చేరవు. డాక్టర్‌తో మీకు అవసరమే ఉండదు. మైదానం లేనిదే నేను లేననే విషయం మీకు తెలుసు కదా. మొదట మైదానాలను బాగుపరచండి. జగిత్యాలలోని మినీస్టేడియం వసతులు లేక నామమాత్రంగా మారింది. కనీసం రన్నింగ్ ట్రాక్‌లు లేవు. ఈత కొలను, షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు ఉన్నా శిక్షకులు లేరు. అంతటా విద్యుత్తు దీపాలు లేక గుడ్డి వెలుతురులో నడకదారులు ఇబ్బందులు పడుతుండటం మైదానాల దుస్థితికి నిదర్శనం. జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉందంటే ఇక మిగతా స్టేడియాల సంగతెలా ఉంటుందో వేరే చెప్పనవసరం లేదు. క్రీడా ప్రాంగణాలు ఏర్పాటై రెండేళ్లవుతున్నా పర్యవేక్షణ లేదు. జిల్లాగా అవతరించినా ఏం లాభం, చిన్నారుల కోసం ఏర్పాటైన పార్కులు ఆహ్లాదానికి ఆమడ దూరంలోనే ఉంటున్నాయి. మీరు బద్ధకం వీడితే గ్రామస్థాయి నుంచి ఒలింపిక్స్ వరకు జరిగే పోటీల్లో పతకాలు మీ సొంతమే. మీ పిల్లలు బంగారు కొండలు కావాలంటే మైదానాలు అభివృద్ధి చేసుకొని నన్ను నన్నుగా ఆదరించి అక్కన చేర్చుకుంటేనే సాధ్యమని గుర్తు పెట్టుకోండి. నా ఆవేదన అర్థం చేసుకొని నాకు చేరువవుతారుగా.. సెలవు.. అయ్యో మరిచిపోయా, చదువులకే కానీ, క్రీడలకు సెలవు లేదండీ ఇక ఉంటా..

# వనమంతా.. జనమంతా!

కొత్తగూడెం : కార్తిక మాసంలో వన సమారాధనకు విశేష ప్రాధాన్యం ఉంది. శివకేశవారాధనకు అత్యంత ప్రీతిపాత్రమైనదీ పవిత్ర మాసం. ఈ సందర్భంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సామూహిక వనారాధనల జోరు కొనసాగుతోంది. పుణ్యమాసం ముగియనున్న తరుణంలో.. ఆది, సోమవారాల్లో వనాలకు తరలివెళ్లేందుకు ఘనమైన ఏర్పాట్లు జరిగాయి. లక్షలాది మంది పాల్గొనే ఈ వేడుకలు పలు విశేష కార్యక్రమాలకు వేదికగా నిలవనున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా వన సమారాధనలు కేవలం సామాజిక వర్గాలకే కాదు, చైతన్యానికీ వేదికలుగా నిలుస్తున్నాయి. పలు ప్రాంతాలకు భిన్నంగా ఈ కార్యక్రమాలు జరుపుకోవడమే ఇందుకు నిదర్శనం. కుల, ఉద్యోగ, వ్యాపార కుటుంబాలే కాదు.. మానవత, సమానత్వ ప్రాతిపదికన జరుపుకొనే 'జన సమారాధన' ఇక్కడి ప్రత్యేకత. ఓ వైపు సకుటుంబ సమేత సందళ్లు.. ఇంకోవైపు సామాజిక ఐక్యతా నినాదాలు విశిష్ఠతను చాటుతున్నాయి. నేడు, రేపు పలు వనాలు ఇందుకు వేదికలుగా నిలుస్తున్నాయి. వనంలో ఒకరోజు గడుపుదాం అనే ఆలోచనకే పరిమితం కాకుండా.. 'మన కోసం–జనం కోసం' అంటూ పలు సంఘాలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నాయి. పేదల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడం, ప్రతిభావంతులైన విద్యార్థులను నగదు నజరానాలతో ప్రోత్సహించడం, సమాజ సేవా కార్యక్రమాలకు హితోధికంగా సాయపడటం వీటిల్లో కొన్ని. తమ ప్రాంతాల వారీ అపరిష్కృత సమస్యలకు ముఖ్య అతిథుల సహకారంతో పరిష్కార మార్గాలు వెతికే ఆనవాయితీ ఉమ్మడి జిల్లా వన సమారాధనలకు ఎంతో పేరుతెస్తుందని చెప్పాలి. ఈ ఆదివారం కార్తికమాసంలో చివరిది.. పైగా సెలవు రోజు. దీంతో అన్ని నియోజకవర్గాల నుంచి వేలాది కుటుంబాలు వీటిల్లో పాల్పంచుకోనుండటం విశేషం. ప్రముఖుల రాకతో కోలాహలం..నేటి వన సమారాధనలకు ఆయా వర్గాల ప్రముఖులతోపాటు రాజకీయ ప్రతినిధులు పెద్ద హాజరుకానున్నారు. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులతోపాటు ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, రేణుకా చౌదరి, వద్దిరాజు రవిచంద్ర, అనిల్‌కుమార్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. వీరితోపాటు పలువురు ప్రముఖులు, స్థానిక అధికారులకు నిర్వాహకుల నుంచి పెద్ద ఎత్తున ఆహ్వానాలు అందాయి. ఇదే క్రమంలో మహిళలు, బాలల్లో ఉత్సాహాన్ని నింపేలా సాంస్కృతిక, ఆటల పోటీల నిర్వహించనున్నారు.

# నిలోఫర్‌లో బూచోళ్లు..!



హైదరాబాద్ : నగరంలోని ప్రసూతి, చిన్నపిల్లల ఆసుపత్రుల్లో చిన్నారుల కిడ్నాప్‌లు ఆందోళన కలిగిస్తున్నాయి. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతుండటం నిఘా వైఫల్యాన్ని తెలియజేస్తోంది. తాజాగా కామెర్ల బారిన పడి, నిలోఫర్ ఆసుపత్రిలో చికిత్స తీసుకొని ఇంటికి వెళ్లేందుకు సిద్ధమైన నెల రోజుల శిశువును గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి చిక్కారు.

**గదుల్లోనే ఆర్ఎంవోలు..**

నిలోఫర్‌కు నిత్యం తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాది మంది తల్లిదండ్రులు చిన్నారులను చికిత్స కోసం తీసుకొస్తారు. వారిని కంటికి రెప్పలా పర్యవేక్షించాల్సిన ఆర్ఎంవోల్లో కొందరు గదులకే పరిమితమవుతున్నారనే ఆరోపణలున్నాయి. ఆసుపత్రి వైద్యులు మాత్రం కుటుంబసభ్యుల అజాగ్రత్త వల్లనే పిల్లలు మాయమవుతున్నారంటూ చేతులెత్తేస్తున్నారు. ఏటా ఒకరిద్దరు పిల్లలు ఇక్కడ అపహరణకు గురవుతున్నా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందనే విమర్శలు ఉన్నాయి.

**రూ.20 ఇస్తే దర్జాగా వెళ్లొచ్చు**

చికిత్స పొందుతున్న చిన్నారులను చూసేందుకు వచ్చేవారికి ప్రత్యేక పాస్‌లు ఇచ్చి వారిని మాత్రమే లోపలకు అనుమతిస్తారు. కిటకిటలాడే ఆసుపత్రిలో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించటం సవాల్‌గా మారుతోంది. ఇదే అదనుగా అపరిచితులు రోగుల బంధువులమంటూ వార్డుల్లోకి ప్రవేశించి పిల్లలను ఎత్తుకెళ్తున్నారు. కొందరు భద్రతా సిబ్బంది రూ.20–30 తీసుకొని ఎవరినైనా లోపలకు పంపుతున్నట్లు ఆరోపణలున్నాయి.

**కొన్ని సంఘటనలు**

2017: పేట్లబురుజు ఆసుపత్రి నుంచి నిలోఫర్‌కు తీసుకొచ్చిన 2 రోజుల శిశువును ఆరోగ్య సిబ్బంది అని చెప్పి ఓ మహిళ కిడ్నాప్ చేసింది.

2022: పద్దెనిమిది నెలల వయసున్న చిన్నారిని ఓ మహిళ ఎత్తుకెళ్లగా, సీసీ కెమెరాల ఆధారంగా అత్తాపూర్‌లోని కల్లుకాంపౌండ్ వద్ద చిన్నారిని గుర్తించిన పోలీసులు సురక్షితంగా తీసుకొచ్చారు. ఆమెను అరెస్ట్ చేశారు.

2023: ఓ మహిళ ఆరు నెలల చిన్నారి తల్లితో మాట కలిపి, బిడ్డతో మాయమైంది. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు బిడ్డను సురక్షితంగా తల్లి ఒడికి చేర్చారు.

2024: జహీరాబాద్‌కు చెందిన హసీనా బేగం, గఫార్ దంపతులు తమ బాబుకి చికిత్స చేయించారు. డిశ్చార్జి అయిన రోజే ఆసుపత్రి సిబ్బందినంటూ సహాయం చేస్తున్నట్టు నటించిన మహిళ అదను చూసి చిన్నారిని అపహరించింది.

# సమీకృత గురుకులం.. విద్యాభివృద్ధికి సోపానం




తాండూరు : పేద విద్యార్థులకు కుల మతాలకు అతీతంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యాబోధన అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సమీకృత గురుకుల పాఠశాలల (యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్) ఏర్పాటుకు నడుం బిగించింది. ప్రస్తుతం ఉన్న గురుకులాల్లో భవనాల కొరత, అద్దె భవనాలు, బోధన వంటి ఇబ్బందులున్నాయి. వీటి పరిష్కారంతోపాటు తాజాగా ఈ గురుకులాలను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో 5 నుంచి 12వ తరగతి వరకు వీటిలో సకల సౌకర్యాలతో చదువులు సాగుతాయి.

**కొడంగల్‌లో ఇప్పటికే శంకుస్థాపన**

సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో గత నెలలో మొదటి విడతగా సమీకృత గురుకులాన్ని మంజూరు చేయగా, తాజాగా రెండో విడతలో తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాలకు మంజూరు చేశారు. యాలాల మండలం దౌలాపూర్‌లో ఇప్పటికే 25 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. రెండూ కలిపి సుమారు రూ.750 కోట్ల వ్యయంతో సమీకృత గురుకుల భవనాలను నిర్మాణం చేపట్టనున్నారు. కొడంగల్‌లో ఇప్పటికే శంకుస్థాపన చేయగా.. త్వరలో దౌలాపూర్, వికారాబాద్‌లో పనులను ప్రారంభిస్తారని అధికారులు పేర్కొన్నారు.

**2,000 నుంచి 3,000 మందికి అవకాశం**

సమీకృత గురుకుల పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు కొత్త వారికి అవకాశం కల్పిస్తారు. సుమారు 2,000 నుంచి 3,000 మంది విద్యార్థులు చదువు, వసతికి అవసరమైన విశాలమైన గదుల నిర్మాణం, బోధన, బోధనేతర సిబ్బందికి వసతి కల్పిస్తారు. ఇన్నోవేటివ్ బోధన విధానం, కంప్యూటర్ సెంటర్, గ్రంథాలయం, ఆడిటోరియం, డైనింగ్, వంటగది, వైద్యశాల, ఇండోర్ గేమ్స్, క్రికెట్, ఫుట్‌బాల్ మైదానాలు, బాస్కెట్‌బాల్, వాలీబాల్, టెన్నిస్ కోర్టులు, జిమ్, ల్యాండ్ స్కేప్ కోర్టు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. త్వరలో శంకుస్థాపన చేస్తాం మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే తాండూరువికారాబాద్, తాండూరు నియోజకవర్గాలకు తాజాగా సమీకృత గురుకుల పాఠశాలలు మంజూరయ్యాయి. తాండూరుకు సంబంధించి దౌలాపూర్‌లో ఇప్పటికే 25 ఎకరాల స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదించాం. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సౌకర్యాలతో, విద్యను అందించే వీలుగా రూపకల్పన చేస్తున్నారు. త్వరలో పనులకు శంకుస్థాపన చేస్తాం.

# లక్ష మందికి శిక్షణ



హైదారాబాద్ : రైళ్ల రాకపోకలు, భద్రత తదితరాంశాలపై కీలకపాత్ర పోషిస్తూ సుక్షితసిబ్బందిని అందిస్తున్న తార్నాకలోని ఇండియన్ రైల్వేస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజినీరింగ్ అండ్ టెలీకమ్యూనికేషన్స్ (ఇరిసెట్) 67 వసంతాలు పూర్తి చేసుకుంది. రైల్వే సిగ్నలింగ్, టెలీ కమ్యూనికేషన్‌లో ఇప్పటివరకు 1,12,842 మందికి శిక్షణ ఇచ్చింది.

సదుపాయాలివే..యూపీఎస్సీ, ఆర్ఆర్‌బీల ద్వారా ఎంపికైన వారికి ఈ సంస్థలో శిక్షణ ఇస్తారు. దాదాపు 6నెలల పాటు ఇక్కడ తర్ఫీదు ఇస్తుండగా...రైళ్ల రాకపోకల్లో కీలకమైన అవుట్‌డోర్ సిగ్నలింగ్, ట్రైన్ డిటెక్షన్, ఎలక్ట్రికల్ సిగ్నలింగ్, ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్స్, బ్లాక్ సిగ్నలింగ్, టెలిఫోనీ, నెట్‌వర్కింగ్‌లో నైపుణ్యాలు పెంపొందిస్తారు. 13 విభాగాల ప్రయోగశాలలు ఉన్నాయి. నాలెడ్జి రిపోజిటరీ, పెద్ద సంఖ్యలో సాంకేతిక, పరిశోధన పుస్తకాలను అందుబాటులో ఉంచేందుకు ఇక్కడ 100 ఎంబీపీఎస్ యాక్సెస్ బ్యాండ్‌విడ్త్‌తో నేషనల్ నాలెడ్జ్ నెట్‌వర్క్ (ఎన్‌కేఎన్) అనుసంధానించడం విశేషం.

**విదేశీయులకు శిక్షణ..** ఇరిసెట్‌లో ఏటా 5,300 అధికారులు, పర్యవేక్షకులు, విదేశీయులు శిక్షణ పొందుతుంటారు. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (డి.ఎఫ్.సి.సి.ఐ.ఎల్), రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్.వి.ఎన్.ఎల్), రైల్‌టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఆర్.సి.ఐ.ఎల్) వంటి ప్రభుత్వ రంగ సంస్థల ఎగ్జిక్యూటివ్‌లు, మెట్రో రైల్వేస్ ప్రతినిధులు ఇక్కడ ఆధునిక సాంకేతికతలపై శిక్షణ పొందారు.

'కవచ్' పరిశోధనలు.. రైళ్ల భద్రతలో కీలక పాత్ర పోషిస్తున్న కవచ్ వ్యవస్థపై ఇక్కడ పరిశోధనలు జరుగుతున్నాయి. కవచ్– ఇండియా రైల్వేస్ ఆటోమెటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్స్‌పై పరిశోధన చేయడానికి ఇన్‌స్టిట్యూట్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ)ని2022లోస్థాపించారు.

# భవనమిచ్చారు.. నిధులు మరిచారు

సిరిసిల్ల : ఆధునిక సాగు పద్ధతులపై కర్షకులను సుశిక్షితులను చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. ప్రత్యేక కార్యాచరణతో అన్నదాతలు ఒకే చోట పంట యాజమాన్యంపై చర్చించే వెసులుబాటు కల్పించింది. ఇదంతా బాగానే ఉన్నా నిర్వహణకు నిధులు విడుదల చేయకపోవడం ఇబ్బందిగా మారింది. ప్రతి అయిదు వేల ఎకరాలకు క్లస్టర్‌గా పరిగణిస్తూ రైతు వేదికలను నిర్మించారు. పంటల పరిశీలనకు ఓ వ్యవసాయ విస్తరణ అధికారులను నియమించారు. 2.4 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా 57 క్లస్టర్‌ల వారీగా రైతులకు వివిధ రకాల సేవలు అందుతున్నాయి. ఎప్పటికప్పుడు పంట యాజమాన్య పద్ధతులను వివరిస్తూ అన్నదాతలను చైతన్యం చేయాలన్నది వేదికల ప్రధాన ఉద్దేశం. జిల్లాలోని 13 వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమం అమలవుతోంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శాస్త్రవేత్తల సలహాలు దృశ్య మాధ్యమాల ద్వారా అందుతున్నాయి.



**ఏఈవోలపై నిర్వహణ భారం**

మూడేళ్ల క్రితమే రైతు వేదికలు అందుబాటులోకి వచ్చాయి. నిర్వహణ కోసం ప్రతినెల రూ.9 వేలు అందించేందుకు రెండేళ్ల క్రితం ప్రభుత్వం నిర్ణయించినా నిధులు అందడం లేదు. నిర్వహణ నిధులు విడుదల కాక సుమారు రూ.10 లక్షల వరకు కరెంటు బిల్లుల బకాయి ఏర్పడింది. వేదికల్లో సమావేశాల నిర్వహణ సమయంలో కుర్చీలు వేయడం మొదలుకొని, చర్యలు ముగిశాక సర్దటం ఏఈవోల వంతుగా మారింది. పరిశుభ్రత చూసేందుకు సహాయకులు లేకపోవడంతో భవనాలు బూజు పడుతున్నాయి. పారిశుద్ధ్య పనుల్లో కనీసం గ్రామ పంచాయతీల నుంచి సాయం అందడం లేదు. జిరాక్సులు, స్టేషనరీల ఖర్చు ఏఈవోలే భరిస్తున్నారు.

**విద్యుత్తు సరఫరా నిలిపివేత**

వీర్నపల్లి మండలంలో రెండు రైతు వేదికలు ఉన్నాయి. ఇద్దరు వ్యవసాయ విస్తరణ అధికారులు పనిచేయాల్సి ఉండగా ఒకరు ఇటీవల బదిలీపై వెళ్లారు. దీంతో రెండు క్లస్టర్‌లను ఒక్కరే చూస్తున్నారు. ప్రతినెల సుమారు రూ.7 వేల వరకు నిర్వహణ కోసం సదరు ఏఈవోనే భారం మోస్తున్నారు. రూ.14 వేల బకాయి ఉందని ఏడాది క్రితమే గర్జనపల్లి రైతు వేదికకు సెస్ సిబ్బంది కరెంటు సరఫరా నిలిపివేశారు. ఇలాంటి వాస్తవిక పరిస్థితులే జిల్లాలోని చాలా రైతు వేదికల్లో ఉన్నాయని చెబుతున్నారు.

**జీతంలో కొంత నిర్వహణకు..**

ఏఈవోలపై పని ఒత్తిడి ఎక్కువైంది. ప్రతినెల వేదికల నిర్వహణ భారంగా మారుతోంది. తాళాలు తీసింది మొదలు వేసే వరకు అన్ని పనులు విస్తరణ అధికారులే చూడాల్సి వస్తున్నా.. రెండేళ్లుగా ఒక్క రూపాయి నిర్వహణ కోసం రాలేదు. దీంతో జీతం డబ్బులు వెచ్చిస్తున్నాం. ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిర్వహణ నిధులు విడుదల చేయాలి. లక్ష్మణ్, ఏఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడు

# శిక్షణతో నైపుణ్యం.. ఉపాధికి మార్గం

గోదావరిఖని: నిరుద్యోగులకు ఉపాధి మార్గం చూపేందుకు సింగరేణి కృషి చేస్తోంది. డంప్‌ట్రక్ ఆపరేటర్లుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తోంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి 50 మంది చొప్పున సింగరేణి యువతకు ఉపాధి మార్గం చూపుతోంది. అవకాశం ఉన్న చోట పొరుగు సేవల ద్వారా ఉపాధి అవకాశాన్ని కల్పిస్తోంది. సంస్థ విస్తరించి ఉన్న పరిసర గ్రామాల నిరుద్యోగ యువతకు వేలాది రూపాయలు వెచ్చించి శిక్షణ అందజేస్తోంది. 32 రోజుల పాటు వివిధ దశల్లో శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రాలు అందజేస్తోంది. వీటితో ఎక్కడైనా ఆపరేటర్లుగా ఉద్యోగంలో చేరే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు ఏడు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తికాగా ప్రస్తుతం మరో బృందంలో యువత శిక్షణ పొందుతున్నారు.

**వివిధ దశల్లో...**

నిరుద్యోగ యువతను ఉపాధి మార్గం వైపు మళ్లించేందుకు సింగరేణి సంస్థ శిక్షణ కోసం ఎంపిక చేసిన ఒక్కొక్కరిపై రూ.20 వేలు ఖర్చుచేస్తోంది. బెంగళూరుకు చెందిన వోల్వో కంపెనీ నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా ప్రతి బ్యాచ్‌లో 50 మందికి శిక్షణ ఇస్తోంది. 18 రోజుల పాటు గోదావరిఖనిలోని ఆర్జీ–1 ఎంవీటీసీలో తరగతులు నిర్వహించిన తర్వాత 12 రోజుల పాటు క్షేత్రస్థాయి శిక్షణ ఉంటుంది. రెండు రోజులు డంప్‌ట్రక్‌తో వెళ్లి పనిచేయాల్సి ఉంటుంది. అక్కడ ఎదురయ్యే ఇబ్బందులు, ఇతర అంశాలను గమనించి వాటిని అధికారులకు వెల్లడించాల్సి ఉంటుంది.

ప్రభావిత గ్రామాలకు ప్రాధాన్యం

శిక్షణకోసం సింగరేణి ప్రభావిత గ్రామాల యువతకు ప్రాధాన్యం ఉంటుంది. ప్రస్తుతం సింగరేణి బొగ్గు ఉత్పత్తి చేపడుతున్న గనుల పరిసర ప్రాంతాల్లోని జనగామ, సుందిళ్ల, ముస్త్యాల, సింగిరెడ్డిపల్లె, పెద్దంపేట, లద్నాపూర్, పన్నూరు ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగ యువతతో పాటు కార్మికులు, విశ్రాంత కార్మికుల పిల్లలను ఎంపిక చేసి శిక్షణ ఇస్తుంది. ఇప్పటి వరకు ఏడు బృందాల్లో 335 మంది తర్ఫీదు పొందారు.

**ఎంతో ఉపయోగం**శిక్షణ ద్వారా ఎంతో ఉపయోగం ఉంటుంది. డంప్‌ట్రక్ డ్రైవింగ్‌లో తర్ఫీదు తీసుకుంటే ఎక్కడైనా ఉద్యోగం సాధించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పరిశ్రమల్లో భారీ యంత్రాల ద్వారానే పనులు చేపడుతున్నారు. డంప్‌ట్రక్ నేర్చుకోవడం భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుంది. సింగరేణి సహకారంతో శిక్షణ తీసుకుంటున్నా. ఎం.డి.సలాఉద్దీన్, గోదావరిఖని

**ఉపాధి కోసం...**

డంప్‌ట్రక్ డ్రైవింగ్ శిక్షణ తీసుకోవడం ద్వారా ఉపాధి పొందే అవకాశం ఉంటుంది. భారీ యంత్రాల ద్వారా చేపట్టే పనులకు అవకాశం వస్తుంది. మా నాన్న సింగరేణిలో పనిచేశారు. నేను పదో తరగతి వరకు చదువుకున్నా. ఉపాధి అవకాశాలు లభించడం లేదు. శిక్షణ ద్వారా అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నా. శ్రీనివాస్, గోదావరిఖని ఓబీ కంపెనీలో పనికోసంఉపరితల గనుల్లో చేపడుతున్న ఓబీ కంపెనీల్లో పని కోసం చేరేందుకు అవకాశం ఉంటుంది. అందులో నడిచే యంత్రాలపై పనిచేసేందుకు డంప్‌ట్రక్ శిక్షణ ఎంతో అవసరం ఉంటుంది. సింగరేణి యాజమాన్యం ద్వారా మాకు అవకాశం లభించింది. ప్రభావిత గ్రామాల నిరుద్యోగులకు వివిధ రకాల ఉపాధి అవకాశాలపై శిక్షణ ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది. జయపాల్‌రెడ్డి, సుందిళ్ల

## అభివృద్ధి.. అక్రమాలు.. ఫిర్యాదులు

హైదరాబాద్ :రాష్ట్ర పురపాలిక, పరిపాలన సంచాలకులు(సీడీఎంఏ) వి.పి.గౌతం కరీంనగర్‌లో పర్యటించనున్నారు. రాష్ట్ర స్థాయి అధికారి రానుండటంతో బల్దియా అధికారులు అప్రమత్తమయ్యారు. కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో స్మార్ట్‌సిటీతోపాటు పలు రకాల అభివృద్ధి పనులు జోరుగా సాగాయి. ఈ పనులన్నీ దాదాపు పూర్తి కాగా, స్మార్ట్‌సిటీ పనులు మాత్రం తుది దశలో ఉన్నాయి. కొన్ని పనులు అంచనాలకు విరుద్ధంగా చేశారని, అక్రమాలు జరిగాయని భారాస, కాంగ్రెస్ కార్పొరేటర్లు కొందరు వేర్వేరుగా సీడీఎంఏ, ఈఎన్‌సీకి, విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. వీటిపై విచారణ చేయాలని ఆదేశాలు కూడా వస్తుండటం, బహిరంగంగానే ఆరోపణలు చేసుకోవడం వంటివి ఇటీవల పలు వివాదాలకు కారణంగా మారుతోంది. మరో వైపు ఉద్యోగుల పనితీరు, నిబంధనలకు విరుద్ధంగా ఒప్పంద ఉద్యోగులను నియమించుకున్నారనే విమర్శలు



వచ్చాయి. వీటిపై ఎలా స్పందిస్తారో చూడాలి మరి.

**ఉద్యోగుల కొరత**

నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. క్షేత్రస్థాయిలో పని చేసే ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, పారిశుద్ధ్య పర్యవేక్షకులు లేకపోవడంతో ఉన్న వారిపైనే పని భారం పెరిగింది. దాంతో జవాబుదారి లేకుండా పోతుంది.

**స్మార్ట్‌సిటీ ఐసీసీసీపై సమీక్ష**

సీడీఎంఏ హైదరాబాద్ నుంచి 7 గంటలకు బయలుదేరుతారు. ఉదయం 10.20 గంటల నుంచి ఉ.11.20 గంటల వరకు నగరపాలికలోని సమీకృత నిఘా నిర్వహణ కేంద్రం(ఐసీసీసీ)పరిశీలించి, వరంగల్, కరీంనగర్ స్మార్ట్‌సిటీ అధికారులతో కార్యాలయంలోనే సమీక్ష నిర్వహిస్తారు. 11.20నుంచి 12.20 గంటల వరకు ధోబీఘాట్, డంపింగ్‌యార్డు, 12.20 నుంచి 1.30 గంటల వరకు జంతు సంరక్షణ కేంద్రం పరిశీలించనున్నారు.

మధ్యాహ్న భోజనంతరం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు రాజీవ్ స్వగృహ పథకం, రెండు పడక గదుల ఇళ్లను పరిశీలించి సమీక్షించనున్నారు. అక్కడి నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళ్లనున్నారు. పలుమార్లు వాయిదా పడుతున్న ఈ పర్యటన ఎట్టకేలకు ఖరారు కావడంతో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ఈ మేరకు మున్సిపల్‌పై సమీక్ష నిర్వహించే అవకాశం ఉండటంతో కావాల్సిన సమాచారాన్ని సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది.

**పెండింగ్ పనులు ఎలా?**

కరీంనగర్‌లో ముఖ్యమంత్రి హామీ నిధులతో ప్రారంభించి వదిలేసిన పనులతో ప్రజలు నానావస్థలు పడుతున్నారు. నగరవ్యాప్తంగా 60కి పైగా పనులు తవ్వి వదిలేశారు. పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకు రాకపోవడం, పెండింగ్ బిల్లులు ఇవ్వాలని మెలిక పెట్టడంతో పది నెలలుగా ప్రజలు నరకయాతన పడుతున్నారు. ప్రతి నెలా వచ్చే పట్టణ ప్రగతి నిధులు నిలిచిపోవడంతో విద్యుత్తు, ఇతర రకాల బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. డంపింగ్‌యార్డు సమస్య పరిష్కారం కావడం లేదు. ఇప్పటికీ మంటలు వస్తూనే ఉన్నాయి.

## చెత్తను కొంటామన్నా.. తప్పని ప్రదక్షిణ

హైదరాబాద్ : చెత్త నిర్వహణపై జీహెచ్‌ఎంసీలో కనిపించని యుద్ధమే జరుగుతోంది. వ్యర్థాల యాజమాన్యంలో కొత్త సంస్థలు ప్రవేశించకుండా పాత వారు అడ్డుకుంటుంటే.. అధునాతన సాంకేతికతతో వ్యర్థాలకు కొత్త అర్థం చెబుతామంటున్న నూతన ప్రతిపాదనలు అటకెక్కుతున్నాయి. రోజువారీ చెత్తలోని కాగితం, ఇతర లోహ పదార్థాల సేకరణ విషయంలో మరికొన్ని సంస్థలు పోటీ పడుతున్నాయి. అయితే.. ఈ పోటీలో అధికారులు, జీహెచ్‌ఎంసీ సమన్యాయం పాటించట్లేదనే విమర్శలొస్తున్నాయి. దీర్ఘకాలంగా వ్యర్థాల యాజమాన్యంలో పాతుకుపోయిన అధికారుల తీరుతో.. జీహెచ్‌ఎంసీ ఖజానాకు గండిపడుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. వ్యర్థాల రీసైక్లింగ్ రంగంలోని ఏ ఒక్క అంకుర సంస్థకు కూడా బల్దియా ప్రోత్సాహం ఇవ్వకపోవడమే అందుకు నిదర్శనం.

**అంతా డంపింగ్ యార్డుకేనా..**

ఘన వ్యర్థాల నిర్వహణ విభాగంలో పదేళ్లకుపైగా పాతుకుపోయిన సీనియర్ ఇంజినీర్లు డంపింగ్‌యార్డును నిర్వహిస్తోన్న రాంకీ సంస్థకు ప్రయోజనం చేకూరుస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. ఆ రంగంలో కొత్త సంస్థలకు అవకాశం ఇవ్వకుండా, కొత్త తరం రీసైక్లింగ్ విధానాలతో అంకుర సంస్థలను స్థాపిస్తోన్న యువతకు సీనియర్ ఇంజినీర్లు ఏ



మాత్రం ప్రోత్సాహం ఇవ్వట్లేదని ఇంజినీరింగ్ విభాగం ఉన్నతాధికారులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కోటి మంది నివసిస్తోన్న హైదరాబాద్‌కు జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు ఒక్కటే ఉంది. దానిపై ఒత్తిడి తగ్గించేందుకు, చెత్తను విద్యుత్తుగా మార్చాలన్న లక్ష్యంతో పదేళ్ల కిందట బీబీనగర్‌లో విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయగా.. అధికారుల నిర్లక్ష్యంతో మూతబడింది. ఓ ప్రైవేటు సంస్థ ఇబ్రహీంపట్నంలోని యాచారంలో విద్యుదుత్పత్తి కేంద్రాన్ని నిర్మించింది. కాలుష్యం లేని విద్యుత్తును ఉత్పత్తి చేస్తామని జీహెచ్‌ఎంసీ చుట్టూ ప్రదక్షిణ చేస్తూనే ఉంది. అయినా అధికారులు అనుమతించడం లేదు.చెత్తను డంపింగ్‌యార్డుకు తరలిచేందుకు ఓ లెక్క, నిల్వ చేస్తున్నందుకు మరో లెక్కన రాంకీ సంస్థ బిల్లులు తీసుకుంటుంది. అంతా ఒప్పందం ప్రకారమే జరుగుతున్నా.. జీహెచ్‌ఎంసీపై భారం పడకుండా 'చెత్త'కు పరిష్కారం చూపుతామన్న సంస్థలను ప్రోత్సహించకపోవడం అనేక ప్రశ్నలకు తావిస్తోంది. మీ నుంచి చెత్తను కొనుగోలు చేసి, ప్రైవేటు స్థలంలో నిల్వ చేసి, దాన్నుంచి విద్యుదుత్పత్తి చేస్తామని ప్రైవేటు సంస్థ కోరుతున్నా బల్దియా అనుమతివ్వకపోవడమే అందుకు నిదర్శనం.

## సిబ్బంది కొరత.. పారదర్శకత ఎలా?



సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో కొంతకాలంగా ఏపీవో, సాంకేతిక సలహాదారు (ఈసీ)లు లేక ఉన్న సాంకేతిక సహాయకుల (టీఏ)కే అదనపు బాధ్యతలు అప్పగించారు. వారికి కేటాయించిన పనుల పర్యవేక్షణతోపాటు అదనంగా వారి పనులు చూసుకోవాల్సి వస్తోంది. జిల్లాలో పలు సాంకేతిక, క్షేత్ర సహాయకుల పోస్టులు కూడా ఖాళీగా ఉండడమే కాకుండా నూతనంగా ఏర్పడిన పంచాయతీలకు క్షేత్ర సహాయకుల నియామకాలు లేకపోవడంతో పాత పంచాయతీ పరిధిలో వారే చూసుకోవాల్సిన పరిస్థితి. గ్రామాల్లో వలసల నివారణతోపాటు ప్రతి కూలీకి పని కల్పించాలన్న ఉద్దేశ్యంతో కేంద్రం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టింది. గ్రామాల్లో వందల మంది కూలీలు పనులకు వెళ్తుండటంతోపాటు వివిధ అభివృద్ధి పనుల కింద రూ.కోట్ల విలువ గల పనులు నిర్వహిస్తున్నారు. ఆయా పనుల పర్యవేక్షించేందుకు సిబ్బంది లేమి, కూలీ భద్రతపై అధికారులు చేతులెత్తేయడంతో పనుల్లో నాణ్యత లేకుండా పోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఇదీ పరిస్థితి జిల్లాలోని 380 పంచాయతీల పరిధిలో నిత్యం వివిధ పనుల నిమిత్తం కూలీలు పనులకు వెళ్తున్నారు. ఆయా కూలీలు చేపట్టే పనుల పర్యవేక్షణకు పూర్తి స్థాయిలో సిబ్బంది నియామకాలు లేకపోవడంతో పనుల్లో అవకతవకలు జరుగుతున్నట్లు ఏటా నిర్వహిస్తున్న సామాజిక తనిఖీల్లో వెల్లడవుతూనే ఉన్నాయి.

గ్రామాల్లో నిర్వహించిన పనుల కొలతలు, రికార్డులు చేసేందుకు సాంకేతిక సలహాదారులు మండలానికి ఒక్కరు ఉండాల్సి ఉండగా జిల్లా వ్యాప్తంగా కేవలం ఏడుగురు మాత్రమే ఉండగా, ఏపీవోలు కూడా బీర్‌పూర్, సారంగాపూర్, బుగ్గారం, జగిత్యాల అర్బన్, మేడిపల్లి మండలాల్లో ఖాళీ ఉన్నాయి.

గ్రామాల్లో పనులు పర్యవేక్షించే సాంకేతిక సహాయకులు జిల్లా వ్యాప్తంగా 54 మందికి గానూ ప్రస్తుతం 31 మంది పనిచేస్తున్నారు.

పలు మండలాల్లో సాంకేతిక సలహాదారులు, ఏపీవోలు ఖాళీలు ఉండటంతో వీరికే అదనపు బాధ్యతలు అప్పగించారు.

ప్రభుత్వం తండాలను పంచాయతీలుగా మార్చడంతో నూతనంగా ఏర్పాటైన వాటికి క్షేత్ర సహాయకుల నియామకాలు చేపట్టకపోవడంతో పాత వారితోనే సర్దుకు పోవాల్సి వస్తోంది. ఇప్పటికే ఉన్న ఆయా గ్రామాల్లో పూర్తి స్థాయిలో లేకపోగా, నూతన పంచాయతీలకు మరింత ఇబ్బందిగా మారింది.

380 పంచాయతీలకు గానూ ప్రస్తుతం 242 మంది మాత్రమే క్షేత్ర సహాయకులు కొనసాగుతున్నారు.

పంచాయతీలు విడిపోయి ఏళ్లు గడుస్తున్నా పాత పంచాయతీల నుంచే పనులు కల్పించడం, వేర్వేరు ప్రాంతాల్లో కూలీలు పనులకు వెళ్లడంతో ప్రతి కూలీ హాజరు పనుల వద్దకు క్షేత్ర సహాయకులు వెళ్లి నమోదు చేయడం ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్యవేక్షణ కొరవడటంతో కొలతల్లో తేడాలు, గతంలో చేపట్టిన పనుల్లో మళ్లీ చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏళ్లుగా అందని సామగ్రి

ఉపాధి హామీ పనులకు వచ్చిన కూలీలకు పనుల వద్ద వసతులతోపాటు అన్ని రకాలుగా భద్రత కల్పించాల్సి ఉంటుంది. కొన్నేళ్లుగా సామగ్రి పంపిణీ చేయకపోగా కూలీలకు నీడ వసతికోసం గ్రామానికి రెండు, మూడు కవర్లు అందించే వారు. వాటని కూడా నిలిపివేయడంతో చెట్ల నీడకు సేద తీరాల్సిన పరిస్థితి. సీజన్‌లో ఒక్కో సారి గ్రామంలో కనీసం 100 నుంచి 200లకు పైగా కూలీలు పనులకు వెళ్తుంటారు. గతంలో ఉపాధి హామీ పథకం కూలీలకు వచ్చే వారికి గడ్డపార, పారలను అందించేవారు. 2014 నుంచి వాటిని అందించడం లేదు. దీంతో కూలీలు వాటిని కొనుగోలు చేసుకొని పనులకు వెళ్లాల్సి వస్తోంది. రూ.కోట్లలో నిధులు వ్యయం చేస్తున్నా.. పరికరాలు అందించకపోవడం పట్ల కూలీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పనుల వద్ద మెడికల్ కిట్ ఉంచాల్సి ఉండగా సరఫరా లేకపోవడంతో అందుబాటులో ఉన్న ఆశా కార్యకర్తల వద్ద నుంచి తీసుకోవాల్సి వస్తోంది. ప్రమాదాలకు గురైన కూలీలకు ప్రభుత్వం పరిహారం అందిస్తుండగా వాటిపై అవగాహన లేకపోవడంతో సరిగా అందడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

జిల్లాలో ఇలా..జాబ్ కార్డు ఉన్న కుటుంబాలు: 1,65,700


మొత్తం కూలీల సంఖ్య: 2,97,962

పురుషులు: 1,33,822

మహిళలు: 1,64,140

దివ్యాంగ కూలీలు 3,381

## సాదాబైనామా దరఖాస్తులకేదీ మోక్షం!




గోదావరిఖని: భూ యాజమాన్య హక్కుల కోసం చిన్న సన్నకారు రైతులు ఎదురుచూస్తున్నారు. తెల్లకాగితాలు, స్టాంపు పేపర్లతో ఒప్పందం చేసుకుని కొనుగోలు చేసిన భూములకు గత ప్రభుత్వం హక్కులు కల్పిస్తామన్న ప్రకటన నెరవేరలేదు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు.. ఆర్థిక ప్రయోజనాలకు భూ యాజమాన్య హక్కులు తప్పని సరిగా మారాయి. దీంతో రైతుల ఇబ్బందులను గుర్తించిన గత ప్రభుత్వం మూడున్నరేళ్ల క్రితం సాదా బైనామాలన్నింటినికి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని ప్రకటించగా.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1.12 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. నేటికీ మోక్షం లభించడంలేదు.

తరతరాలుగా సాగు

చాలామంది రైతులు సాగు చేసుకుంటున్న కొన్ని భూములకు వారి పేరుపై ఎలాంటి పత్రాలు లేవు. పూర్వకాలంలో తెల్లకాగితాలు, స్టాంపు పేపర్లపై ఒప్పందం చేసుకుని కొనుగోలు చేసిన భూములు సాగుచేసుకుంటూ వస్తున్నారు. అధికారికంగా రికార్డుల్లో పాత వారి పేరుతోనే ఉంటుంది. దీంతో రికార్డుల్లో ఉన్నవారికి సంబంధించిన వారసులు, కుటుంబసభ్యుల నుంచి కొన్ని గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొన్నిచోట్ల వారసులు వచ్చి అది తమ భూమి అంటూ సాగులో ఉన్నవారిని బెదిరింపులకు పాల్పడిన సందర్భాలున్నాయి. కొన్ని సంఘటనలు ఠాణాల వరకూ వెళ్లాయి.

తమకే హక్కు ఉందంటూ ఒత్తిడి

గతంలో సాదాబైనామాతో కొనుగోలు చేసిన భూముల్లో కొన్నింటికి ప్రస్తుతం విలువ పెరిగింది. వ్యవసాయ భూములు కొనుగోలు చేసిన రైతులకు.. కొన్ని ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారానికి అనుకూలంగా మారాయి. దీంతో రికార్డుల్లో ఉన్నవారితో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారికంగా తమకే హక్కు ఉందంటూ ఒత్తిడి చేస్తున్నారు. లేదంటే ప్రస్తుతం ఉన్న విలువ ప్రకారం డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. కొన్నేళ్లుగా సాగు చేసుకుంటూ జీవిస్తున్న చిన్న, సన్నకారు రైతులు ఊహించని పరిణామాలతో ఆందోళన చెందుతున్నారు.

సర్కారుకు ఆదాయం

ఎంతోకాలంగా పరిష్కారం కాని సాదాబైనామా భూములకు ప్రభుత్వం హక్కు కల్పించేందుకు తీసుకున్న నిర్ణయంతో యూజర్ ఛార్జీల కింద రైతులు భారీగానే చెల్లించారు. దీంతో భారీ మొత్తంలోనే ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. మీసేవా కేంద్రాల ద్వారా ఈ ప్రక్రియను చేపట్టగా.. ఆయా నిర్వాహకులకు దస్తావేజుల విక్రయాల పేరుతో ఆదాయం లభించింది. సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదని అధికారులు చెబుతున్నారు. కొత్తగా 2024 ఆర్ఓఆర్ చట్టం ద్వారా కొన్ని మార్పులు చేస్తున్నారు. అందులో ఏమైనా దీనికి సంబంధించిన అంశం చేర్చితే పరిష్కారానికి అవకాశం ఉండనుంది.

## రంగులద్ది..వక్రబుద్ధి!

ఖమ్మం : గుడుంబా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం రవాణాపై నిషేధం ఉంది. ఎక్కడ కనిపించినా కఠిన చర్యలు తీసుకుంటున్నా.. ఆబ్కారీ పోలీసులు. దీంతో తయారీదారులు 'రంగు' మార్చారు. కొత్త ఎత్తులతో అధికారులను ఏమార్చుతున్నారు. అదెలాగంటే.. ఖమ్మం జిల్లా సరిహద్దులోని మహబూబాబాద్, భద్రాచలం ఏజెన్సీలో కొన్నాళ్లుగా గుడుంబా తయారవుతోంది. అక్కడకు పలు మార్గాల్లో నల్లబెల్లం అక్రమంగా తరలుతోంది. మరోవైపు ఆబ్కారీ బృందాలు గాలింపులు కొనసాగుతున్నాయి. బెల్లం ఊటను పెద్ద ఎత్తున ధ్వంసం చేస్తున్నారు. అయినా తమ కళ్లుగప్పి నల్ల బెల్లాన్ని ఎలా తరలిస్తున్నారని పోలీసులు అవాక్కవుతున్నారు.

లోతుగా పరిశీలిస్తే అసలు రంగు బయటపడింది. అదేమంటే.. ఇల్లెందు సమీపంలో ఇటీవల ఓ వాహనంలో తరలుతున్న 9 టన్నుల బెల్లం కొత్తగూడెం జిల్లా ఆబ్కారీ పోలీసులకు పట్టుబడింది. చూస్తే పైపైన మొత్తం తాజా తెల్ల బెల్లంలా కనిపించింది. కానీ పగలగొట్టి చూస్తే అంతా నల్లబెల్లమే! దాన్నంతా రసాయనాలు చల్లి రంగు మార్చినట్లు అధికారులు గుర్తించారు. సరకంతా నాలుగు రోజుల తర్వాత మళ్లీ నలుపు రంగులోకి యథాతథ స్థితికి వస్తుందట. ఇదిలా ఉంటే.. రంగు మార్చిన బెల్లాన్ని ఈ ఏడాది జూన్ నుంచి జులై వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో 3,018 కిలోలు పట్టుకున్నారు. గుట్టుగా తరలించిన సరకు ఇంతకు ఐదు రెట్లు ఉంటుందని అంచనా.

ఎక్కడెక్కడ తయారవుతోందంటే?

బెల్లం తయారీ కేంద్రాల్లో మిగిలిన వ్యర్థాలు, మగ్గిన పదార్థాలను కిలో రూ.20కి కొనుగోలు చేస్తున్నారు. దానిపై తెల్లటి రసాయనాలు చల్లి రంగు మార్చుతున్నారు. గుడుంబా తయారీదారులకు కిలో రూ.50 చొప్పున విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో తేలింది. నిల్వలను సైతం కాలం చెల్లిన వాహనాల్లోనే తరలిస్తున్నారు. తనిఖీల బెడద, ధరాభారంతో కొందరు రూటు మార్చారు. గుడుంబాను చక్కెరతో తయారుచేస్తున్నారు. తెలుపుదనం కోసం పటికకు బదులు చైనా నుంచి తప్పించే తెల్లని పొడిని వాడుతున్నారు. ఈస్ట్ సైతం వినియోగిస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో గుడుంబా తయారీని ఎలా కట్టడి చేయాలా? అని ఆబ్కారీ శాఖ తలలుపట్టుకుంటోంది.

ముమ్మర తనిఖీలు చేపడతాం..ఎక్సైజ్ శాఖ సహాయ కమిషనర్ గణేష్ మాట్లాడుతూ 'ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో పాటు జిల్లా టాస్క్‌ఫోర్స్, స్థానిక స్టేషన్ బృందాలతో కలిసి గుడుంబా తయారీపై నిఘా పెంచాం. బెల్లం రంగు మారుస్తున్న విషయాన్ని పసిగట్టాం. సరకు తరలకుండా ముమ్మర తనిఖీలు కొనసాగిస్తాం' అని చెప్పారు.

## ఉన్నత చదువుకు బకాయిల భారం

జగిత్యాల : పేద పిల్లలు ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం సమకూరుస్తున్న ఆర్థిక సాయం నిలిచిపోయింది.. విద్యాసంవత్సరం సగం మేర పూర్తయినా బకాయిలు రాకపోవడంతో యాజమాన్యాలు కళాశాలలు మూసి నిరసన తెలుపుతుండగా, ప్రభుత్వ నిర్లక్ష్యం తమ భవిష్యత్తుకు ప్రతిబంధకంగా మారిందని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు..ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడేళ్లుగా ప్రైవేటు డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాలల ఖాతాలకు చేరాల్సిన ఆర్‌టీఎఫ్(రీయింబర్స్‌మెంట్ ట్యూషన్ ఫీ) నిధులు పేరుకుపోయాయి. నిర్వహణ భారంగా మారిందని యాజమాన్యాలు కళాశాలలు మూసి నిరసన తెలుపుతుండటంతో దసరా సెలవుల తరువాత విద్యార్థులు ఇళ్ల వద్దే ఉండిపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

నాలుగు జిల్లాల పరిధిలో 64 డిగ్రీ, 35 పీజీ కళాశాలలతో పాటు 8 ఇంజినీరింగ్, 15 వరకు ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలున్నాయి. అన్ని చోట్లా కలిపి దాదాపు 42 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. డిగ్రీ స్థాయిలో రూ.20 వేలు, ఇంజినీరింగ్ తదితర కోర్సులకు రూ.27 వేల వరకు ప్రభుత్వం ఆర్టీఎఫ్‌ను చెల్లిస్తోంది.

కొన్ని కోర్సులు మినహాయించి దాదాపు డిగ్రీ విద్యార్థుల ఫీజు మొత్తం రీయింబర్స్‌మెంట్ ద్వారానే యాజమాన్యాలకు అందుతోంది.

దాదాపు 95 శాతం మంది విద్యార్థులు ప్రభుత్వం చెల్లించే రుసుంతోనే



చదువు పూర్తి చేస్తున్నారు.

మూడేళ్లుగా చెల్లింపులు లేక నాలుగు జిల్లాల్లో కలిపి రూ.120 కోట్ల వరకు బకాయిలున్నాయి.

2021-22కు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో 30 శాతం, 2022-23కు సంబంధించి 90 శాతం బకాయిలున్నాయి. గత విద్యా సంవత్సరం(2023-24)లో ఒక్క పైసా విడుదల కాలేదు.

ప్రస్తుత విద్యా సంవత్సరం విషయంలో అతిగతీ లేకపోగా తెలంగాణ అఫ్లియేటెడ్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీడీపీఎంఏ) ఆధ్వర్యంలో పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించారు. స్పందన లేకపోవడంతో శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రైవేటు కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఎస్‌యూపీఎంఏ) ఆధ్వర్యంలో బంద్ నోటీసు అందించారు. రెండు రోజులుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి.

ఉపకార వేతనాలదీ అదే పరిస్థితి

కొన్ని కోర్సులకు సంబంధించి విద్యార్థులు ఆర్టీఎఫ్ పోగా మిగతా ఫీజును చెల్లిస్తామనే ఒప్పందంతో కళాశాలల్లో చేరుతున్నారు. ఉపకార వేతనాలు మంజూరైతే మిగతా ఫీజును చెల్లిద్దామనుకున్నా రెండేళ్లుగా ఎంటీఎఫ్ (మెయింటెనెన్స్ ఫీ టు స్టూడెంట్) సక్రమంగా అందడం లేదు. చదువు పూర్తయినా ప్రభుత్వం నుంచి కళాశాల యాజమాన్యాలకు ఆర్టీఎఫ్ రాకపోవడంతో టీసీ, మార్కుల జాబితా తదితర ధ్రువపత్రాలు తీసుకునే సమయంలో విద్యార్థులు ఫీజు చెల్లించాల్సి వస్తోంది. చాలా కళాశాలల్లో డిగ్రీ విద్యార్థులు ఉపకార వేతనం మొత్తాన్ని కళాశాలకు చెందిన ప్రైవేటు బస్సు రవాణాకు ఉపయోగిస్తున్నారు. అది కూడా రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో కళాశాలలో ఆర్టీఎఫ్ బకాయిలు తృతీయ సంవత్సరం వరకు అలాగే కొనసాగుతున్నాయి.

**తరగతులు నష్టపోతున్నాం**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాలేదని కళాశాలలు మూసివేయడంతో మేం నష్టపోవాల్సి వస్తోంది. ఉపకార వేతనాలు వస్తే అవసరమైన విద్యా సామగ్రిని కొనుక్కునే వాళ్లం. నాకు గతేడాదితో పాటు ఈ సంవత్సరానికి చెందిన ఉపకార వేతనం అందలేదు.

బి.నవ్యశ్రీ, బీకాం ద్వితీయ సంవత్సరం, కరీంనగర్

**వేతనాలు చెల్లించలేకపోతున్నాం**కొన్నేళ్లుగా బకాయిలు రాక కళాశాలలు నడపలేని పరిస్థితిలో ఉన్నాం. సిబ్బందికి వేతనాలు సహా నిర్వహణ తలకు మించిన భారంగా మారింది. అప్పు చేసి తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం బకాయిలను సత్వరమే చెల్లించి విద్యా ప్రగతికి తోడ్పాటునందించాలి.శ్రీపాద నరేశ్, కార్యదర్శి, ఎస్‌యూపీఎంఏ, జగిత్యాల

## యాప్‌తో సాఫీగా సరఫరా..!

జగిత్యాల :ఇంటింటికీ సరఫరా చేసే నీటిలో క్లోరిన్ శాతం ఎంత ఉంది.? మధ్యలో తగ్గిందా..పైపుల్లో ఎంత పరిమాణం మేరకు నీటి సరఫరా జరుగుతోంది? తదతర వివరాలు ముందే తెలిస్తే.. కలుషిత జలాల సరఫరాకు అడ్డుకట్ట వేయొచ్చు కదా.. జలమండలి ప్రవేశపెట్టనున్న స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీతో అది సాధ్యమేనని అధికారులు చెబుతున్నారు. నీటి సరఫరాలో భాగంగా వేలాది వాల్వులు నిర్వహించడం జలమండలికి పెద్ద సవాలుగా మారుతోంది. ప్రస్తుతం వీటిని మాన్యువల్‌గా నిర్వహించడంతో లైన్‌మెన్‌లకు భారం అవుతోంది. నీటి సరఫరాను మరింత పకడ్బందీగా చేపట్టేందుకు జలమండలి ఈ ఆటోమేటిక్ వాల్వ్ ఆపరేషన్ పద్ధతిని నగరమంతా అమలు చేయనుంది. ఇవీ ప్రయోజనాలు..స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీతో లైన్‌మెన్లు క్షేత్రస్థాయిలో తిరగాల్సిన అవసరం లేదు. మొబైల్ యాప్‌తో వాల్వులను నిర్వహించే వెసులుబాటు ఉంటుంది. ఇంటర్‌నెట్ ఆధారిత కమ్యూనికేషన్‌తో వాల్వులను నిర్వహించొచ్చు.వాల్వ్ అనుసంధానంగా పక్కనే వాటి పరికరాలు అమర్చుతారు. ఈ పరికరాలు సోలార్ విద్యుత్తుతో ఛార్జ్ అవుతుంటాయి. బ్యాటరీ బ్యాకప్ సైతం ఉండటంతో నిర్వహణలో విద్యుత్తు సమస్యలు తలెత్తే అవకాశం లేదు.వాల్వులోనే ప్రత్యేక సాంకేతిక వినియోగించడంతో నీటి సరఫరా సమయంలోనే క్లోరిన్ శాతం, నీటి ఒత్తిడి, నాణ్యత సమీపంలో ఉన్న మీటర్లల్లో తెలుస్తుంది. యాప్‌లోనూ ఈ సమాచారం కనిపిస్తుంది. యాప్‌లోనే క్లోరిన్ శాతం తెలుసుకోవడం ద్వారా కలుషిత నీరు సరఫరా కాకుండా అడ్డుకోవచ్చు.సరఫరాలో అవకతవకలకు స్మార్ట్ వాల్వుతో చెక్‌పెట్టొచ్చు.



# సమాజానికి రాజ్యాంగం మూలస్తంభం వంటిది: రాష్ట్రపతి

దిల్లీ: మన దేశ రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పాత పార్లమెంట్ ప్రాంగణంలోని సెంట్రల్ హాల్‌లో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సహా లోక్‌సభ, రాజ్యసభ సభ్యులంతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ప్రసంగించారు. సమాజానికి రాజ్యాంగం మూలస్తంభం వంటిదని కొనియాడారు. "దేశ ప్రజలందరికీ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు. 75 ఏళ్ల క్రితం ఇదేరోజున రాజ్యాంగం ఆమోదం పొందింది. ఇది మన పవిత్ర గ్రంథం. ప్రజాస్వామ్య, గణతంత్ర సూత్రాల ఆధారంగా రాజ్యాంగ రూపకల్పన జరిగింది. రాజ్యాంగానికి రాజేంద్రప్రసాద్, అంబేడ్కర్ మార్గనిర్దేశం చేశారు. ప్రగతిశీల సూత్రాల గురించి రాజ్యాంగంలో పొందుపర్చారు. రాజ్యాంగ రచనలో భాగస్వాములను స్మరించుకోవాలి. మన రాజ్యాంగం సజీవ, ప్రగతిశీల పత్రం. దీన్ని ఆధారంగా చేసుకొని సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి లక్ష్యాలను సాధించగలిగాం" అని ముర్ము ప్రసంగించారు.

**రాజ్యాంగ రచన.. ఒక్కడే... ఒంటిచేత్తో....** ఈ సందర్భంగా మహిళా రిజర్వేషన్లపై చట్టం గురించి రాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీంతో ప్రజాస్వామ్యంలో మహిళా సాధికారిత నవ శకాన్ని ప్రారంభించుకున్నామని అన్నారు.

రాజ్యాంగ నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషించి 15 మంది నారీమణుల సేవలను గుర్తుచేసుకున్నారు. ప్రసంగం అనంతరం సభ్యులందరితో కలిసి రాజ్యాంగ పీఠిక సామూహిక పఠనం చేశారు. అంతకుముందు రాజ్యాంగానికి సంబంధించిన రెండు పుస్తకాలు, 75 వసంతాలకు గుర్తుగా స్మారక పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేశారు.

**అలా చేస్తే ప్రజాస్వామ్యానికి ముప్పు: ఉపరాష్ట్రపతి...** ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ప్రసంగిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశం కంటే వ్యక్తిగత విశ్వాసాలకు ప్రాధాన్యం ఇస్తే.. మనం సాధించుకున్న స్వాతంత్ర్యం ప్రమాదంలో పడుతుందని వ్యాఖ్యానించారు. గందరగోళం సృష్టించడాన్ని ఒక వ్యూహంగా అమలు చేస్తే.. ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. నిర్మాణాత్మక చర్చలు ప్రజాస్వామ్య దేవాలయాల పవిత్రతను పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. అంతకుముందు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రారంభోపన్యాసం చేశారు. నాడు రాజ్యాంగ సభలో సభ్యులు గౌరవంగా అభిప్రాయాలు పంచుకున్నారని, అదే సంప్రదాయాన్ని మనమంతా కొనసాగించాలని బిర్లా సూచించారు.




ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్ బ్రహ్మచారిను బంగ్లాదేశ్‌లో అరెస్టు చేయడంపై భారత్ స్పందించింది. ఆయన్ను అరెస్టు చేసి అరెస్టు, బెయిల్ నిరాకరించడంపై భారత విదేశాంగశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంలో బంగ్లాదేశ్‌లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మైనార్టీలపై దాడులు సరికాదని తెలిపింది. హిందువులు, మైనార్టీలందరికీ భద్రత కల్పించాలని బంగ్లాదేశ్ అధికారులను కోరినట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. బంగ్లాదేశ్‌లో ఇప్పటికే హిందువులు, మైనార్టీలపై తీవ్రవాద గ్రూపుల దాడులకు తెగబడుతున్నాయని.. ఈ క్రమంలోనే తాజాగా ఘటన జరగడంపై ఆందోళనకరమని విదేశాంగ శాఖ పేర్కొంది. మైనార్టీల ఇళ్లలో దోపిడీ, వ్యాపార సంస్థల్లో విధ్వంసం, దేవాలయాలను అపవిత్రం చేయడం వంటి దుశ్చర్యలు చోటుచేసుకున్నాయని తెలిపింది. ఇలాంటి దుర్మార్గాలకు కారణమైన వారిని కాకుండా.. శాంతియుత సమావేశాల ద్వారా న్యాయబద్ధమైన డిమాండ్‌ల కోసం పనిచేస్తున్న వారిపై అభియోగాలు మోపడం దురదృష్టకరమని పేర్కొంది. కృష్ణదాస్ బ్రహ్మచారి అరెస్టు విషయంలో జోక్యం చేసుకొని, ఆయన్ను విడిపించాలని ఇస్కాన్ ఆలయ అధికారులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన విషయం తెలిసిందే.

'ఇస్కాన్‌కు చెందిన కృష్ణదాస్‌ను బంగ్లాదేశ్‌లోని ఢాకా పోలీసులు అరెస్టు చేశారనే వార్తలను మేము చూశాం. అక్కడి అధికారులు ఇస్కాన్‌పై తప్పుడు ఆరోపణలు చేశారు. దీనిపై భారత ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. బంగ్లాదేశ్ ప్రభుత్వంతో మాట్లాడి.. మాది శాంతి, ప్రేమగల భక్తి ఉద్యమం అని తెలపాలి. కృష్ణదాస్‌ను వెంటనే విడుదల చేయాలని బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని కోరుతున్నాం' అని ఇస్కాన్ 'ఎక్స్'లో పేర్కొంది. బంగ్లాదేశ్ మీడియా కథనాల ప్రకారం.. ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్ గత నెలలో అక్కడ జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ జెండాను ఉద్దేశించి పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో ఢాకా విమానాశ్రయంలో ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు అరెస్టును వ్యతిరేకిస్తూ పలు సంఘాలు ఆందోళనకు దిగాయి.




## సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందరికీ అందాలనేది రాజ్యాంగ లక్ష్యం: చంద్రబాబు

అమరావతి: భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్దదని.. ఇవాళ పవిత్ర, విశిష్టమైన రోజని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాజ్యాంగ వజ్రోత్సవాల సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. "భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను ఊహించి రాజ్యాంగం రచించారు. రాజ్యాంగ పరిషత్‌లో తెలుగు వాళ్లు ప్రధాన పాత్ర పోషించారు. సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందరికీ అందాలనేది రాజ్యాంగ లక్ష్యం. ఓటు హక్కు ద్వారా రాజ్యాంగాన్ని కాపాడుకోగలుగుతున్నాం. దీనిని దుర్వినియోగం చేసిన నేతలకు ఓటు ద్వారా ప్రజలు బుద్ధి చెబుతున్నారు.

ప్రాథమిక హక్కులను కూడా గతంలో ఎలా కాలరాశారో చూశాం. అధికార దుర్వినియోగం చేయడం రాజ్యాంగ ఉల్లంఘనే. రాజ్యాంగం ఇచ్చిన అధికారాన్ని ప్రజల కోసం ఉపయోగించాలి" అని చంద్రబాబు పేర్కొన్నారు.



# ఏపీలో రాజ్యసభ ఉప ఎన్నికలు.. కూటమి ఖాతాలోకి 3 స్థానాలు?

ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యసభ ఉప ఎన్నికల సందడి మొదలైంది. వైకాపా సభ్యులు బీద మస్తాన్‌రావు, మోపిదేవి వెంకటరమణ, ఆర్.కృష్ణయ్య రాజీనామాలతో ఖాళీ అయిన 3 స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఏపీలో మొత్తం 175 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 164 సీట్లలో ఎన్డీయే కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. వైకాపాకు ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు.

ఒక్క రాజ్యసభ అభ్యర్థి విజయం సాధించాలన్నా కనీసం 25 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ప్రస్తుతం వైకాపా సంఖ్యాబలం 11 మాత్రమే. దీంతో ఆ పార్టీ రాజ్యసభ బరిలో నిలిచేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. ప్రస్తుతం ఉప ఎన్నిక జరగనున్న 3 స్థానాలను కూటమి కైవసం చేసుకోవడం దాదాపు ఖాయమైంది. అయితే, ఈ 3 స్థానాలను తెదేపా తీసుకుంటుందా? భాగస్వామ్య పక్షాలైన భాజపా, జనసేనకు కూడా అవకాశం ఇస్తుందా? అనేదానిపై చర్చ జరుగుతోంది.

**11 స్థానాల నుంచి పతనం దిశగా వైకాపా..** రాజ్యసభలో మొత్తం 11 స్థానాలను కైవసం చేసుకున్న వైకాపా పతనం మొదలైంది. 2019లో ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక 2020, 2022, 2024 ఫిబ్రవరిల్లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో కలిపి మొత్తం 11 స్థానాలను దక్కించుకుంది. అయితే మొన్నటి సాధారణ ఎన్నికల్లో వైకాపాకు ఘోర పరాభవం పాలైంది. ఆ తర్వాత 100 రోజుల్లోనే జగన్ పార్టీ రాజ్యసభలో మూడు స్థానాలను కోల్పోయింది. ప్రస్తుతం రాజ్యసభలో తెదేపా సభ్యుడు ఒక్కరు కూడా లేరు. తాజా ఉప ఎన్నికల తర్వాత తెదేపా సభ్యులు రాజ్యసభలో అడుగు పెట్టనున్నారు.

# కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్‌తో పవన్ భేటీ




దిల్లీ: ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిల్లీ పర్యటనలో ఉన్నారు. కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను ఆయన కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పర్యాటకానికి సంబంధించి కొన్ని అంశాలు ప్రస్తావించినట్లు పవన్ పేర్కొన్నారు. టూరిజం ప్రాజెక్టులు, పర్యాటక వర్సిటీ వంటి 7 అంశాలపై మాట్లాడినట్లు చెప్పారు. వీటికి గజేంద్ర షెకావత్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో పవన్ సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పులను తాము సరిదిద్దుతున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరికీ రక్షిత మంచినీరు ఇవ్వాలనేది ప్రధాని లక్ష్యమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో నీటి సమస్యలు తమ దృష్టికి వచ్చినట్లు చెప్పారు.



# జగన్‌కు అదానీ ముడుపుల వ్యవహారం.. ఏసీబీకి ఫిర్యాదు


అమరావతి: వైకాపా హయాంలో అప్పటి సీఎం జగన్‌కు అదానీ సంస్థ లంచం ఇచ్చిన వ్యవహారంపై ఏసీబీకి ఫిర్యాదు అందింది.

సెంటర్ ఫర్ లిబర్టీ సంస్థ వ్యవస్థాపకుడు నల్లమోతు చక్రవర్తి ఫిర్యాదు చేశారు. జగన్‌కు అదానీ సంస్థ రూ.1,750కోట్ల లంచం ఇచ్చినట్లు అమెరికా ఏజెన్సీ విచారణలో తేలిందని అందులో ఆయన పేర్కొన్నారు. సెకితో అదానీ కంపెనీ ఒప్పందంపై విచారణ జరపాలని.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# జనవరి 10 నుంచి 19 వరకు.. తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం



తిరుమల, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమలలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని, జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు పది రోజులపాటు వైకుంఠ ద్వార దర్శనానికి అవకాశం కల్పిస్తున్నట్లు తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. ఈ సమయంలో వీఐపీ ప్రొటోకాల్ దర్శనాలు మినహా చంటిపిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు, ఆర్మీ, ఎన్ఆర్ఐల దర్శనాలు, ఇతర ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక అన్నమయ్య భవనంలో తితిదే వివిధ శాఖల ఉన్నతాధికారులతో సోమవారం సమావేశమైన ఆయన వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై సమీక్షించారు




ప్రకాశం జిల్లా: ఒంగోలు ఎస్పీ కార్యాలయంలో విచారణకు సీఐడి రిటైర్డ్ ఏఎస్పీ విజయపాల్ హాజరయ్యారు. ఆయనను ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ప్రశ్నిస్తున్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజును గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అక్రమంగా అరెస్టు చేయడంతో పాటు ఆయనపై పై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన కేసులో అప్పటి సీఐడి ఏఎస్పీ విజయపాల్ విచారణను ఎదుర్కొంటున్నారు. మంగళవారం విచారణకు హాజరయ్యారు. ఈ నెల 13న కూడా విజయ్ పాల్‌ను ఇక్కడే విచారణ జరిపారు. 50 ప్రశ్నలకు ఆయన ముక్తసరిగా సమాధానాలు ఇచ్చారు. 'ఏమో తెలియదు.. గుర్తు లేదు.. మరిచిపోయా' అంటూ సమాధానాలు ఇచ్చినట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి మరోసారి నోటీసులు జారీ చేసి ఈరోజు విచారిస్తున్నారు. కాగా కేసు విచారణ నుంచి రక్షణ పొందేందుకు విజయ్ పాల్ హైకోర్టు నుంచి సుప్రీం కోర్టు వరకు ఆశ్రయించినా ఆయనకు ముందస్తు బెయిల్ లభించలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం ఒంగోలు ఎస్పీ ఎదుట విచారణకు హాజరయ్యారు. విజయ్ పాల్‌ను మొదటి నుంచి అరెస్టు చేయాలని పోలీసులు బావిస్తున్నా.. ఆయన కోర్టులను ఆశ్రయిస్తూ రక్షణ పొందుతూ వచ్చారు. ఈ క్రమంలో సోమవారం సుప్రీం కోర్టులో కూడా ముందస్తు బెయిల్‌పై విజయ్ పాల్‌కు చుక్కెదురైంది. కాగా ఈరోజు సాయంత్రం వరకు విజయ్ పాల్‌ను విచారించే అవకాశముంది. విచారణ సందర్భంగా సరైన సమాధానాలు చెప్పకపోతే.. ఖచ్చితంగా అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. 2021 మే 14న రఘురామకృష్ణం రాజు పుట్టన రోజునే ఆయనను హైదరాబాద్‌లో అక్రమంగా అరెస్టు చేశారు. అక్కడి నుంచి గుంటూరులోని సీఐడీ కార్యాలయానికి తీసుకువచ్చి చిత్రహింసలకు గురిచేశారు. దీనిపై తనకు న్యాయం చేయాలంటూ గుంటూరు నగరపాలెం పోలీస్ స్టేషన్‌లో రఘురామ ఫిర్యాదు చేశారు. దీంతో ఈ కేసు విచారణ బాధ్యతలను ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్‌కు అప్పగించారు. ఈ నేపథ్యంలో మంగళవారం విజయ్ పాల్‌ను రెండోసారి విచారిస్తున్నారు. గతంలో విజయ్ పాల్ చెప్పిన సమాధానాలు ఎక్కడ పొంతన లేకపోవడంతో పోలీసులు మరోసారి విచారణ చేస్తున్నారు. విచారణ అనంతరం అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు తెలియవచ్చింది.

# మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై కేసు నమోదు




తిరుపతి: చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై కేసు నమోదు అయింది. మైనర్ బాలిక విషయంలో దుష్ప్రచారం చేశారని బాలిక తండ్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులు పోక్సో, అట్రాసిటి కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసిన యర్రావారిపాళెం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. మైనర్ బాలికపై అటమ్ట్ రేప్ జరిగిందని దుష్ప్రచారం చేయడంతో.. తమ పరువు ప్రతిష్టలకు భంగం కలిగించారంటూ బాలిక తండ్రి చెవిరెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతోపాటు బాలిక భవిష్యత్‌ను దెబ్బతీసే చర్యలకు పాల్పడ్డారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై కేసు నమోదు చేశారు.

అలాగే చెవిరెడ్డి తన అనుచరులతో ఈ కుట్రకు పాల్పడి.. బాలికపై చేసిన దుష్ప్రచారంపై పోలీసులు కేసు నమోదు చేశారు. భారతీయ శిక్షాస్మృతికి సంబంధించి.. వచ్చిన కొత్త చట్టం ప్రకారం 352, 351/2, 196, 61/2, 353 తదితర సెక్షన్లకింద కేసు నమోదు చేశారు. దాంతో పాటు ఫోక్సో, ఎస్టీ, ఎస్సీ, అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బాధిత కుటుంబం దళిత కుటుంబం కావడంతో పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. సంఘటన జరిగిన రోజు వైఎస్సార్‌సీపీకి చెందిన మీడియా, సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారం జరిగింది. ఇలాంటివి పునరావృతం కాకూడదంటే ఖచ్చితంగా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాలిక తండ్రి డిమాండ్ చేస్తున్నారు.

# మోడ్రన్ లుక్స్‌లో మెరిసిపోతున్న గ్లామర్ క్వీన్ కృతి

టాలీవుడ్‌లో మొన్నటి వరకు సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా గుర్తింపు పొందిన కృతి శెట్టి ఈమధ్య వరుస ఫ్లాప్స్ తో కాస్త స్లో అయ్యింది. అయినప్పటికీ తన చీరల సొగసు, మోడ్రన్ డ్రెస్సింగ్‌తో ఎప్పటికప్పుడు అభిమానులను ఆకట్టుకుంటుంది. ఈమధ్య పాప కెరీర్‌లో బిగ్ హిట్స్ లేకపోయినా, సోషల్ మీడియాలో మాత్రం ఆమె హవా అస్సలు తగ్గడం లేదు. ఆమె తాజాగా షేర్ చేసిన పిక్స్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. కృతి శెట్టి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ ఫోటోల్లో మోడ్రన్ స్టైల్‌లో డిఫరెంట్ లుక్స్‌తో కృతి కనిపించింది. రంగురంగుల టాప్, పర్‌ఫెక్ట్ ఎక్స్‌ప్రెషన్‌తో ఫోటోల కోసం ఫోజులిస్తూ ఆమె చలాకీతనాన్ని, అందాన్ని మరింత హైలైట్ చేసింది. ముఖ్యంగా, ఈ ఫోటోలలో ఆమె సింపుల్ గా ఉన్నా కూడా తన గ్లామర్ టచ్‌ను మిస్ చేయకుండా కంట్రోల్ చేస్తూ క్యూట్ లుక్స్‌తో మెరిసింది. ఈ



ఫోటోలకి నెటిజన్లు ఫిదా అయిపోయారు. "నీ నవ్వు చూడటమే థెరపీ, నువ్వు మెరిసే చందమామ" అంటూ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో కృతి ఫాలోవర్స్ ఆమె అందచందాలను తెగ ప్రశంసిస్తున్నారు. కృతికి ఉండే కలర్ టోన్, నేచురల్ లుక్స్ ఆమె ఫోటోలకు అదనపు ఆకర్షణను తీసుకొచ్చాయి. ఇక కెరీర్ విషయానికి వస్తే, ఉప్పెన సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన కృతి, ఆ తర్వాత వరుస హిట్స్‌తో సక్సెస్ రేట్ పెంచుకుంది. కానీ ఆ తరువాత చేసిన చిత్రాలు అంతగా రాణించలేకపోయాయి. ప్రస్తుతం తెలుగులో కూడా కొత్త ప్రాజెక్టుల కోసం చర్చలు జరుగుతున్నాయని టాక్. మరోవైపు, తమిళ సినిమాల్లో అవకాశాలు అందుకుంటూ తన మార్క్ క్రియేట్ చేయడానికి ప్రయత్నిస్తోంది. తాజాగా ఈ పిక్స్ షేర్ చేయడం ద్వారా కృతి తనదైన ఫ్యాషన్, లైఫ్ స్టైల్‌ను ప్రెజెంట్ చేస్తూ, తన సోషల్ మీడియాలో మరింత క్రేజ్ తెచ్చుకుంది. ఈ వీకెండ్ థెరపీ ఫోటోలతో ఆమె మరింత పాపులర్ అవ్వడం ఖాయం.

# లేడీ ఫైర్ బ్రాండ్ తనయుడు ఇండస్ట్రీకి!

సీనియర్ నటి రోజా కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. నటిగా ఓ వెలుగు వెలిగిన రోజా అటుపై రాజకీయాల్లోనూ చక్రం తిప్పారు. వివిధ పార్టీల్లో కీలక బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ప్రజాక్షేత్రంలోనే ఉన్నారు. లేడీ ఫైర్ బ్రాండ్ గా ప్రత్యేకమైన గుర్తింపు ఆమె సొంతం. అలాగని సినిమాలకు దూరం కాలేదు. మంచి అవకాశాలొస్తే అక్కడా సత్తా చాటడానికి సిద్దంగానే ఉన్నారు. ఇక రోజా-ఆర్కే సెల్వమణి దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్న సంగతి తెలిసిందే. కూతురు కొడుకు గలరు. అప్పుడప్పుడు కుమార్తె ఫోటోలు నెట్టింట వైరల్ అవుతుంటాయి. అచ్చంగా అమ్మనే పోలి ఉంటుంది. హీరోయిన్ మెటీరియల్. మరి కుమారుడు సంగతేంటి? అంటే రోజా కుమారుడిని హీరోని చేసేలా కనిపిస్తున్నారు. కుమారుడికి సినిమాలంటే ఆసక్తి అన్న విషయాన్ని తొలిసారి రివీల్ చేసారు. కుమారుడు కౌశిక్



మంచి హైట్ . ఆరడుగులుంటాడు. ప్రస్తుతం చదువుకుంటున్నాడు. బాగానే చదువుతాడు కానీ చదువు కంటే సినిమాలంటే ఎక్కువ ఆసక్తి అట. హీరో కావాలని ఉందని మామ్ వద్ద చెబుతుంటాడుట. అలాగే డైరెక్షన్ అన్న కూడా ఇష్టమేనట. రెండు రంగాల్లో ఏదో రకంగా స్థిరపడాలి అన్నది కుమారుడి ఆలోచనగా చెప్పుకొచ్చారు. దేవుడి ఆశీస్సులుండే ఇండస్ట్రీకి వస్తాడని అన్నారు.

ఇక మా పాప అన్షు మాలికకి మాత్రం చదువు అంటేనే ఇష్టం. తనకి సైంటిస్ట్ కావాలని ఉంది. ఒకవేళ యాక్టింగ్ వైపు వస్తామంటే మాకు కూడా సంతోషమే. నాకు మూడు చోట్లా మూడు ఇళ్లు ఉన్నాయి. అవన్నీ నేను రాజకీయాలలోకి రావడానికి ముందు ఉన్నవే. ఇక మూడు కార్లు ఉన్నాయి. 150 సినిమాలు చేసిన నాకు బెంజ్ కారు ఉండటంలో ఆశ్చర్యం ఏముంది. ట్రోలింగ్ చేసే వాళ్లను గురించి నేను పట్టించుకోను అని అన్నారు.




# బన్నీ- శ్రీలీల 'కిస్సిక్'.. సూపర్ రికార్డ్ కొట్టేసిందిగా!




టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ తెరకెక్కిస్తున్న పుష్ప-2.. రిలీజ్ కు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం అన్ని పనులు చివరి దశకు చేరుకున్నట్లు సమాచారం. వరల్డ్ వైడ్ గా డిసెంబర్ 5వ తేదీన సినిమాను గ్రాండ్ గా రిలీజ్ చేసేందుకు మేకర్స్ అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. భారీస్థాయిలో రిలీజ్ చేయనున్నారు. ఇప్పటికే సినిమాపై ఆడియన్స్ లో ఎలాంటి బజ్ క్రియేట్ అయిందో స్పెషల్ గా చెప్పనక్కర్లేదు. ఫస్ట్ పార్ట్ కు మించి సీక్వెల్ మంచి హిట్ అవుతుందని అంతా అంచనా వేస్తున్నారు. రూ.1000 కోట్ల క్లబ్ లోకి అడుగుపెడుతుందని భావిస్తున్నారు. అందుకు తగ్గట్లే ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగినట్లు ఇప్పటికే మూవీ టీమ్ క్లారిటీ ఇచ్చేసింది! అయితే మ్యూజిక్ ప్రమోషన్స్ లో భాగంగా మేకర్స్ ఇప్పటికే వరుసగా సాంగ్స్ రిలీజ్ చేస్తున్న విషయం తెలిసిందే. టైటిల్ సాంగ్ తో పాటు సూసేకిని విడుదల చేయగా.. చార్ట్ బస్టర్స్ గా నిలిచాయి. రీసెంట్ గా పుష్ప-2 మేకర్స్ చెన్నై వేదికగా జరిగిన ఈవెంట్ లో యంగ్ బ్యూటీ శ్రీలీల బన్నీతో ఆడిపాడిన కిస్సిక్ సాంగ్ ను రిలీజ్ చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో కిస్ కిస్ కిస్ కిస్సిక్.. కిస్సా కిస్సా కిస్ కిస్సిక్ అనే హమ్మింగ్ తెగ ట్రెండ్ అవుతోంది. ఎక్కడ చూసినా అదే కనిపిస్తోంది. అయితే సాంగ్ టాక్ ఎలా ఉన్నా.. నెట్టింట ఫుల్ వైరల్ అవుతోంది. అయితే కిస్సిక్ సాంగ్ తాజాగా అరుదైన ఘనత సాధించింది. అత్యధిక వ్యూస్ సొంతం చేసుకున్న సౌత్ సాంగ్ రికార్డ్ బ్రేక్ చేసింది. 18 గంటల్లో అత్యంత వేగంగా అత్యధిక వ్యూస్ దక్కించుకున్న దక్షిణాది పాటగా రికార్డు సృష్టించినట్లు మేకర్స్ తాజాగా ప్రకటించారు. 25o మిలియన్ వ్యూస్ ను దక్కించుకున్నట్లు వెల్లడించారు. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ బాణీలు కట్టిన కిస్సిక్ సాంగ్ ను ఆస్కార్ విన్నర్ లిరిసిస్ట్ చంద్రబోస్ సాహిత్యం అందించగా.. సుభ్లాషిణి ఆలపించారు. అయితే పుష్పలో హీరోయిన్ సమంత చేసిన ఊ అంటావా సాంగ్ వేర్ లెవెల్ రెస్పాన్స్ సంపాదించుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ పాటతో కిస్సిక్ సాంగ్ ను అనేక మంది కంపేర్ చేస్తున్నారు. తొలుత కాస్త ట్రోల్స్ వచ్చినా ఇప్పుడు మెల్లగా కిస్సిక్ సాంగ్ ఎక్కుతున్నట్లు అనిపిస్తోంది. మరి చూడాలి కిస్సిక్ పాట చివరికి ఎలాంటి హిట్ అవుతుందో..

# చరణ్, కియారా పర్పుల్ లవ్.. థర్డ్ సింగిల్ ఎప్పుడంటే?




టాలీవుడ్ స్టార్ హీరో రామ్ చరణ్, కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు శంకర్ కాంబోలో గేమ్ ఛేంజర్ మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ పూర్తవ్వగా.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 10వ తేదీన సినిమా రిలీజ్ చేయనున్నట్లు ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. ఆర్ఆర్ఆర్ తర్వాత చరణ్ సోలోగా యాక్ట్ చేస్తున్న సినిమా కావడంతో మెగా ఫ్యాన్స్ గేమ్ ఛేంజర్ కోసం ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ కియారా హీరోయిన్ గా నటిస్తున్నారు. తెలుగమ్మాయి అంజలి కీలక పాత్ర పోషిస్తున్నారు. శ్రీకాంత్, ఎస్ జే సూర్య, సునీల్, సముద్రఖని ముఖ్యమైన రోల్స్ లో కనిపించనున్నారు. భారీ బడ్జెట్ తో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు నిర్మిస్తున్నారు. అయితే ఆ మధ్య కాస్త సైలెంట్ గా ఉన్న గేమ్ ఛేంజర్ మేకర్స్.. ఇప్పుడు వరుస అప్డేట్స్ తో సందడి చేస్తున్నారు. ఇప్పటికే మూవీ నుంచి రెండు సాంగ్స్, టీజర్ రిలీజ్ చేశారు. ఆడియన్స్ లో మూవీపై మంచి అంచనాలు క్రియేట్ చేశారు. పాజిటివ్ బజ్ కూడా సృష్టించారు. ఇప్పుడు ఎంతగానో ఎదురుచూస్తున్న గేమ్ ఛేంజర్ థర్డ్ సాంగ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. మూడో పాటను నవంబర్ 28న రిలీజ్ చేయబోతున్నట్టు ఆదివారం ఉదయం ప్రకటించారు. అదే సమయంలో కొత్త పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. అందులో చరణ్, కియారా పర్పుల్ కలర్ ఔట్ ఫిట్స్ లో ఓ రేంజ్ లో కనిపిస్తున్నారు. అందరినీ ఎంతో ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం చరణ్, కియారా పోస్టర్ తెగ చక్కర్లు కొడుతోంది. పోస్టర్ చాలా కూల్ గా ఉందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

బ్యాక్ గ్రౌండ్ అదిరిపోయిందని, టాలీవుడ్ సూపర్ హిట్ మెలోడీ సాంగ్ ఆన్ లోడింగ్ అంటూ సందడి చేస్తున్నారు. కచ్చితంగా సాంగ్ చార్ట్ బస్టర్ గా నిలుస్తుందని.. వెయిటింగ్ ఫర్ సాంగ్ అని చెబుతున్నారు. అయితే ఆ సాంగ్ కు సంబంధించి ఇప్పటికే గేమ్ ఛేంజర్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ బజ్ క్రియేట్ చేశారు. లిరిసిస్ట్ రామ జోగయ్య శాస్త్రి హైప్ సృష్టించారు. తమన్ నుంచి వచ్చిన బెస్ట్ సాంగ్స్ లో ఒకటి అని తెలిపారు. దీంతో అంతా మంచి అంచనాలు పెట్టుకున్నారు. మరి గేమ్ ఛేంజర్ నుంచి రానున్న మెలోడీ సాంగ్ ఎలా మెప్పిస్తుందో చూడాలి.

# తంగం చూపుల్లో తడిసి ముద్దయ్యేలా..!

శ్రీదేవి తనయురాలు తెరంగేట్రం అనగానే అటు బాలీవుడ్ లోనే కాదు సౌత్ లో కూడా ఆమె గురించి డిస్కషన్స్ పెట్టారు. 2018 లో దడక్ తో ఎంట్రీ ఇచ్చిన జాన్వి కపూర్ ఒక్కో సినిమా చేస్తూ ప్రేక్షకులకు దగ్గరవుతూ వచ్చింది. ఇక సౌత్ లో ఆమెకు ఉన్న క్రేజ్ చూసి ఎన్టీఆర్ దేవర సినిమాకు ఓకే చెప్పింది. తెలుగు తెర మీద జాన్వి అందాల ప్రదర్శన దేవర 1కు కలిసి వచ్చిందని చెప్పొచ్చు. ఇక దేవర 1 తర్వాత వెంటనే చరణ్ తో కూడా లక్కీ ఛాన్స్ పట్టేసింది. చరణ్ బుచ్చి బాబు కాంబో సినిమాలో జాన్వి కథానాయికగా నటిస్తుంది. వీటితో పాటు బాలీవుడ్ సినిమాలు కూడా చేస్తుంది. ఐతే దేవర తో సౌత్ ఆడియన్స్ ముఖ్యంగా తెలుగు ప్రేక్షకుల ప్రేమను రుచి చూసిన జాన్వి కపూర్ ఇక్కడే వరుస సినిమాలు చేయాలని చూస్తుంది. ఐతే సినిమాలతోనే కాదు తన ఫోటో షూట్స్ తో కూడా జాన్వి కపూర్ ఆడియన్స్ ని మెప్పిస్తుంది. చూపు తిప్పుకోలేని విధంగా



జాన్వి అందాల జాతర తన ఫాలోవర్స్ కు స్పెషల్ ట్రీట్ అందిస్తుంది. లేటెస్ట్ గా అమ్మడు మరో క్రేజీ ఫోటో షూట్ తో జాన్వి అదరగొట్టేస్తుంది. లైట్ కలర్ డ్రస్ తో లూజ్ హెయిర్ వేసుకుని అలా తన ఓర చూపులతో మత్తుజల్లేస్తుంది అమ్మడు. అలా తనను చూస్తూ ఉండిపోవాల్సిందే అనేంతగా అమ్మడి లుక్స్ ఉన్నాయి. దేవరలో తంగం గా తన అందచందాలతో అదరగొట్టిన జాన్వి కపూర్ ఓ పక్క నటిగా తనని తాను ప్రూవ్ చేసుకుంటూనే మరోపక్క గ్లామర్ పరంగా తన స్ట్రెంగ్త్ చూపిస్తుంది. జాన్వి చేసే ఫోటో షూట్స్ కి సెపరేట్ ఫ్యాన్స్ ఉన్నారు. ఆమె గ్లామర్ షోకి పిచ్చెక్కిపోతున్న ఫాలోవర్స్ చాలామంది ఉన్నారు. తెలుగులో తంగం అదే మన జాన్వి ఫ్యాన్ ఫాలోయింగ్ ఎక్కువ కాగా కచ్చితంగా రాబోతున్న సినిమాలతో అమ్మడు మరింత క్రేజ్ తెచ్చుకుంటుందని చెప్పొచ్చు. ఈమధ్య తెలుగు సినిమాలు పాన్ ఇండియా వైడ్ గా సత్తా చాటుతున్న ఈ టైం లో జాన్వి కపూర్ కూడా ఇక్కడే ఎక్కువ ఫోకస్ చేయాలని చూస్తుంది. అటు సినిమాలు ఇటు ఫోటో షూట్స్ రెండు బ్యాలెన్స్ చేస్తూ జాన్వి దుమ్ముదులిపేస్తుంది.

# బాలీవుడ్.. తారక్ మరొకటి వాళ్ళతోనేనా?

టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్.. రీసెంట్ గా దేవర మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన ఆ మూవీ.. సినీ ప్రియులను మెప్పించి మంచి వసూళ్లు సాధించి మేకర్స్ కు లాభాలు తెచ్చి పెట్టింది. అయితే దేవర తర్వాత తన అప్ కమింగ్ చిత్రాలపై దృష్టి పెట్టారు తారక్. త్వరలో కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తో చేయాల్సిన సినిమాను స్టార్ట్ చేయనున్నారు. 2025 స్టార్టింగ్ లో తారక్- నీల్ ప్రాజెక్టు సెట్స్ పైకి వెళ్లనున్నట్లు సమాచారం. 2026 సంక్రాంతికి ఆ మూవీ.. ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఇప్పటికే మేకర్స్ అనౌన్స్ చేశారు. టాలీవుడ్ బడా ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్ తో నిర్మించనుంది. మరో కోలీవుడ్ డైరెక్టర్ నెల్సన్ చెప్పిన కథకు ఎన్టీఆర్.. రీసెంట్ గా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. త్వరలోనే అఫిషియల్ స్టేట్మెంట్ కూడా రానుందని వినికిడి. అయితే టాలీవుడ్ లో తనకంటూ స్పెషల్ మార్క్ క్రియేట్ చేసుకున్న తారక్.. బాలీవుడ్ లో ఇప్పుడు డెబ్యూ మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. బీటౌన్ స్టార్ హీరో హృతిక్ రోషన్ తో కలిసి వార్ -2 మూవీలో నటిస్తున్నారు. సినిమాలో నెగెటివ్ షేడ్స్ ఉన్న రోల్ లో కనిపించనున్నట్లు ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. నెవ్వర్ బిఫోర్ అనేలా ఎన్టీఆర్ రోల్ ఉంటుందని తెలుస్తోంది. రీసెంట్ గా తారక్ లుక్స్ లీక్ అయ్యి



సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో వార్ -2 లో ఎన్టీఆర్ ఓ రేంజ్ లో అలరించనున్నట్లు అంతా ఫిక్స్ అయిపోయారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఆ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం కానుకగా వచ్చే ఏడాది ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకు రానున్న మూవీ కోసం అంతా వెయిట్ చేస్తున్నారు. అదే సమయంలో ఇప్పుడు సోషల్ మీడియాలో ఇంట్రెస్టింగ్ న్యూస్ చక్కర్లు కొడుతోంది. బాలీవుడ్ లో వార్ -2 తర్వాత మరిన్ని సినిమాల్లో నటించాలని తారక్ ఫిక్స్ అయ్యారని తెలుస్తోంది. అగ్ర దర్శకులతో కలిసి పనిచేయాలని ఎన్టీఆర్ ఆసక్తిగా ఉన్నారని సమాచారం. వార్ -2 ప్రొడక్షన్ హౌస్ ప్రముఖ సంస్థ యష్ రాజ్ ఫిల్మ్స్ భారీ బడ్జెట్ తో ఎన్టీఆర్ తో మరో సినిమా తీయడానికి రెడీ అయినట్లుగా టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే ఆదిత్య చోప్రా, ఎన్టీఆర్ మధ్య డిస్కషన్స్ జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చర్చలు ప్రారంభదశలో ఉన్నాయని సమాచారం. అయితే ఎన్టీఆర్ ఓకే అంటే.. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించడానికి రెడీగా ఉన్నట్లు ఇండస్ట్రీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. వార్ -2 రిలీజ్ కు ముందే అనౌన్స్మెంట్ రానుందని సమాచారం. ఇప్పుడు ఈ విషయం నెట్టింట వైరల్ గా మారినా.. ఎంత వరకు నిజమో తెలియాలంటే కొద్దిరోజుల పాటు వెయిట్ చేయాల్సిందే .

